www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -174 శనివారం 10 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఎల్‌నినోపై సీఎం ఫోకస్

## 12న మంత్రులతో ప్రత్యేక సమావేశం

**ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై చర్చ**

**ఇప్పటికే కేంద్రాన్ని రూ.20 వేల కోట్ల..**

**సాయం కోరిన రాష్ట్ర ప్రభుత్వం**



**హైదరాబాద్, అక్టోబరు 9(ప్రజావినికిడి):** రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కరువు ఛాయలు, చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దృష్టి సారించారు. దీనిపై ఈ నెల 12న మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.

వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై వారితో చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్తు డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు.రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించడంతోపాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం ద్వారా విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరింది. మంత్రులతో నిర్వహించే సమావేశంలో వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై చర్చించే అవకాశముంది. రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై చర్చించే అవకాశముంది.



# భద్రతా వలయంలో ఢిల్లీ!



**సీఈసీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల భారీ నిరసనలకు పిలుపు**

**ఢిల్లీలో 20 వేల మంది బలగాలతో కఠిన భద్రతా ఏర్పాట్లు**

**57 మెట్రో స్టేషన్ల మూసివేయాలన్న పోలీసులు.. పలు రైళ్ల సర్వీసులు రద్దు**

**జంతర్ మంతర్ వద్ద నిరసనకు పోలీసుల అనుమతి నిరాకరణ**

**పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్షలు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (ప్రజావినికిడి):**
ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి తలపెట్టిన భారీ నిరసనల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. 20,000 మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించి, దేశ రాజధానిలో భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది.పరిస్థితి తీవ్రత దృష్ట్యా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మిగతాది 2లో...

# నవీ పిళ్లేకు నోబెల్ శాంతి పురస్కారం..

**అంతర్జాతీయ న్యాయం కోసం అలుపెరుగని పోరాటం**

**భారత సంతతికి చెందిన దక్షిణాఫ్రికా న్యాయ నిపుణురాలు నవీ పిళ్లే**

**యుద్ధ నేరాలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై పోరాటానికి గుర్తింపు**

**రువాండా, అంతర్జాతీయ న్యాయస్థానాల్లో న్యాయమూర్తిగా కీలక పాత్ర**



2లో.

## కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా

# బీసీలకు 34% ఇస్తాం

**సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చంద్రబాబు ప్రకటన**

**ప్రతి రైతు సమస్య పరిష్కారమే మా లక్ష్యం**

**రాజముద్రతో 40 లక్షల పాస్‌పుస్తకాలిచ్చాం**

**ప్రకాశం జిల్లా సభలో సీఎం చంద్రబాబు**

**ఒంగోలు, అక్టోబర్ 9(ప్రజావినికిడి):**
: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం కన్నా అధికంగానే సీట్లు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. వారందరినీ గెలిపించుకుని తీరుతామని ఉద్ఘాటించారు. గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లి అడ్డుకున్నా సరే బీసీల ప్రాతినిధ్యం పెంచేందుకుమిగతాది 2లో...





# అధికార పార్టీల హవా

**బెంగాల్ ఉప ఎన్నికల్లో 2 సీట్లలో బీజేపీ జయభేరి**

**తమిళనాడులో 2 సీట్లు ఖాతాలో వేసుకున్న టీవీకే**

**అసోంలోని నగావ్ లోక్‌సభ స్థానం బీజేపీదే**

**పుదుచ్చేరి అసెంబ్లీలో ఏకైక స్థానాన్ని ఏఐఎన్ఆర్‌సీ కైవసం**

**బీజేపీ గెలుపుపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం**

**న్యూఢిల్లీ/ చెన్నై, అక్టోబర్ 9(ప్రజావినికిడి):**
: మూడు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఐదు అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానానికి ఈ నెల 6న జరిగిన ఉప ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లోని అధికార పార్టీలే జయభేరి మోగించాయి. బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజీనగర్.. తమిళనాడులోని మధురాంతకం, ధారాపురం.. పుదుచ్చేరిలోని తట్టంచావడి అసెంబ్లీ స్థానాలతోపాటు అస్సాంలోని నగావ్ లోక్‌సభ స్థానానికి మిగతాది 2లో...

# పెండింగ్ దరఖాస్తులకు నెలలోగా పరిష్కారం

**జీఓ 59పై మంత్రి పొంగులేటి ప్రకటన..**

**సీఎం రేవంత్ రెడ్డి హామీ అమలులో భాగంగా ఈ నిర్ణయమని వెల్లడి**

**దరఖాస్తుల పరిశీలనకు ఆదేశాలు జారీ చేశామన్న మంత్రి**



**హైదరాబాద్ అక్టోబర్ 9(ప్రజావినికిడి):**
తెలంగాణలో జీఓ 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 500 చదరపు గజాల లోపు ఉన్న ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మిగతాది 2లో...

# ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి

## రాష్ట్రపతి ముర్ముకు ఇండియా కూటమి నేతల వినతి



**ఓట్ల చోరీ జరిగిందనటానికి పూర్తి ఆధారాలున్నాయి**

**గత రెండేళ్లలో జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికల్ని రద్దు చేయాలి!**

**ఇకపై ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతో నిర్వహించాలి**

**ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి, జ్ఞానేశ్‌ను తొలగించాలి**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9(ప్రజావినికిడి):**
సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో వరుసగా మూడు రోజులు ఢిల్లీలో ఉద్యమించిన ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. ఎన్నికల్లో ఓట్ల చోరీ జరుగుతోందని, దానిని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. జ్ఞానేశ్‌కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తొలగించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, గత రెండేళ్లలో జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలని, ఈవీఎంలను పక్కనపెట్టి ఇకపై బ్యాలెట్ మిగతాది 2లో...

# పూల పండుగకు వేళాయే...

**పూల పండుగకు పుట్టింటికి ఆడపడుచులు**

**దేవీ నవరాత్రులతో భక్తి పారవశ్యం**

**18న సద్దుల బతుకమ్మ.. 20న విజయదశమి**



**హైదరాబాద్ అక్టోబర్ 9(ప్రజావినికిడి):**
పల్లెలు పండుగ శోభను సంత రించుకోనున్నాయి. ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ.. భక్తిశ్రద్ధలతో కొలిచే దేవీ శరన్నవరాత్రులు.. విజయదశమి వేడుకలు.. ఇలా పండుగల సందడి మొదలుకానుంది. పట్టణాలు, గ్రామాల్లో ఇప్పటికే పండుగ ఏర్పాట్లు ఊపందుకున్నాయి. దేవాలయాలు, ప్రధాన కూడళ్లు, బతుకమ్మ ఆడే ప్రదేశాలు ముస్తాబవుతున్నాయి. బతుకమ్మ పండుగ వచ్చిందంటే ఆడపడుచులు పుట్టింటికి తరలివస్తారు. మిగతాది 2లో...



# ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?

**ప్రజా తీర్పును గౌరవించడం కాంగ్రెస్‌కు అలవాటు లేదన్న కిషన్ రెడ్డి**

**రాహుల్ గాంధీ తీరులో ప్రమాదకర ధోరణులు కనిపిస్తున్నాయని విమర్శ**

**హైదరాబాద్ అక్టోబర్ 9(ప్రజావినికిడి):**
కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రజా తీర్పును గౌరవించడం అలవాటు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పనితీరులో ఒక వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని మిగతాది 2లో...



# భద్రతా వలయంలో ఢిల్లీ!

**(మొదటి పేజీ తరువాయి**

తన అధికారిక పర్యటనలు, అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, భద్రతా చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, ఈరోజు జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన నిరసన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించారు.

భద్రతా చర్యల్లో భాగంగా, ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని పోలీసులు మెట్రో అధికారులను కోరారు. అలాగే, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు వచ్చే పలు రైళ్లను ఈరోజు రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. జంతర్ మంతర్ పరిసరాల్లో సీసీటీవీలు, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలతో నిఘాను కట్టుదిట్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఈసీ కార్యాలయం వద్ద ఇప్పటికే ఉన్న జడ్+ భద్రతతో పాటు భారీగా భద్రతను పెంచారు.

ఇదిలా ఉండగా, ఢిల్లీకి వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పూర్, భోపాల్ వంటి నగరాల్లోనే పోలీసులు అడ్డుకుంటున్నారని సీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికారులు వెల్లడించారు.

# అధికార పార్టీల హవా

**(మొదటి పేజీ తరువాయి**

నిర్వహించిన ఉప ఎన్నికల ఫలితాలను శుక్రవారం వెల్లడించారు. నందిగ్రామ్‌లో బీజేపీ అభ్యర్థి హసిరాణి రథ్ తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌ను రికార్డు స్థాయిలో 1,22,753 ఓట్ల తేడాతో ఓడించారు. హసిరాణికి 1,64,427 ఓట్లు పోలవగా, మిలన్ ప్రధాన్‌కు 41,674 ఓట్లు మాత్రమే వచ్చాయి. ముస్లిం ఓటర్లు అధికంగా ఉన్న రెజీనగర్‌లో కూడా బీజేపీ జయకేతనం ఎగురవేసింది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి శంకర సర్కార్ తన సమీప ప్రత్యర్థి, ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ(ఏజేయూపీ) అభ్యర్థి గొలామ్‌నబీ ఆజాద్‌పై 75,816 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఇక్కడ దాదాపు 60 శాతం ముస్లిం ఓటర్లే ఉంటారు. అస్సాంలోని నగావ్ లోక్‌సభ స్థానంలో అధికార బీజేపీ అభ్యర్థి దేబాశిష్ శర్మ తన సమీప ప్రత్యర్థి, ఏఐయూడీఎఫ్ అధినేత బద్రుద్దీన్ అజ్మల్‌ను 1,42,224 ఓట్ల తేడాతో ఓడించారు. గెలుపొందిన బీజేపీ అభ్యర్థులనుప్రధానిమోదీ అభినందించారు. ముస్లిం ఓటర్లు బీజేపీని ఆదరిస్తున్నారనటానికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు.తమిళనాడులోని మధురాంతకం (ఎస్సీ) అసెంబ్లీ స్థానంలో అధికార తమిళగ వెట్రి కళగం(టీవీకే) అభ్యర్థి మరగతం కుమారవేల్ తన సమీప ప్రత్యర్థి, డీఎంకే అభ్యర్థి పరంధామన్‌ను 20,040 ఓట్ల తేడాతో ఓడించారు. ధారాపురం (ఎస్సీ)లో టీవీకే అభ్యర్థి సత్యభామ.. డీఎంకే అభ్యర్థి సుగన్యను 9,471 ఓట్ల తేడాతో ఓడించారు. ఈ గెలుపుతో తమిళనాడు అసెంబ్లీలో టీవీకే బలం 109 సీట్లకు పెరిగింది. 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీలో మెజారిటీ మార్కు 118 కాగా, ఏప్రిల్- మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 సీట్లు గెలిచింది. రెండుసీట్లలో గెలిచిన సీఎం విజయ్ తిరుచిరాపల్లి ఈస్ట్ స్థానాన్ని వదులుకోవటంతో ఆ పార్టీ బలం 107కు తగ్గింది. తాజాగా 109కి పెరిగింది. పుదుచ్చేరిలోని తట్టన్‌చావడి స్థానంలో అధికార ఏఐఎన్ఆర్‌సీ పార్టీ అభ్యర్థి అశోక్ ఆనంద్ కాంగ్రెస్ అభ్యర్థి ఈ వినాయగమ్‌ను 8,400 ఓట్ల తేడాతో ఓడించారు.

## పెండింగ్ దరఖాస్తులకు నెలలోగా పరిష్కారం

**(మొదటి పేజీ తరువాయి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన 22-ఏ సమస్యల పరిష్కార హామీ అమలులో ఇది మరో కీలక ముందడుగు అని అన్నారు.ఈ మేరకు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం మెమో నెం. 48030 జారీ చేసిందని మంత్రి వివరించారు. "జీఓ 59 అమలులో ఎలాంటి అక్రమాలకు తావులేదు. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయి" అని ఆయన హామీ ఇచ్చారు. గతంలో జారీ చేసిన కన్వేయన్స్ డీడ్‌లపై కూడా సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని పొంగులేటి వెల్లడించారు.

సీఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఏ సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని... 10 నుంచి 12 రకాల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. జీఓ 118, జీఓ 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి ముందస్తు అనుమతులు పొంది 22-ఏ జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు కూడా అనుమతి ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు.

# పూల పండుగకు వేళాయే...

**(మొదటి పేజీ తరువాయి**

కుటుంబ సభ్యులు, తోబుట్టువులు, బంధువులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారు. దీంతో దూర ప్రాంతాల్లో ఉన్న ఆడపడుచుల రాకతో గ్రామాలు, పట్టణాల్లో సందడి నెలకొంటుంది.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలను పేర్చి, సాయంత్రం మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు చేసుకుంటారు. ప్రకృతి, నీరు, మట్టి, పూలతో ప్రజలకు ఉన్న అనుబంధాన్ని ఈ పండుగ ప్రతిబింబిస్తుంది. బతుకమ్మను తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీకగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.బతుకమ్మ ఉత్సవాలు శనివారం ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు కొనసాగనున్నాయి. చిన్న బతుకమ్మల నుంచి పెద్ద బతుకమ్మల వరకు రోజుకో ప్రత్యేకతతో వేడుకలు నిర్వహిస్తారు. చివరి రోజైన 18న సద్దుల బతుకమ్మను ఘనంగా జరుపుకోనున్నారు.

బతుకమ్మతో పాటు ఆదివారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు, భజనలు, పారాయణాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని పలు ప్రధాన దేవాలయాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లోనూ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.నవరాత్రుల అనంతరం ఈనెల 20 మంగళవారం విజయదశమి జరగనుంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరాను నిర్వహించడం ఆనవాయితీ. తెలంగాణలో దసరాకు ప్రత్యేక స్థానం ఉంది. కుటుంబ సమేతంగా ఆలయాలకు వెళ్లడం, జమ్మి చెట్టును పూజించడం, పెద్దలను కలిసి ఆశీర్వాదాలు తీసుకోవడం, పరస్పరం జమ్మి ఆకులను ఇచ్చిపుచ్చుకోవడం వంటి సంప్రదాయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.బతుకమ్మ, దసరా పండుగలు కేవలం ఆచార వ్యవహారాలు మాత్రమే కాదు.. కుటుంబాలను, బంధుత్వాలను కలిపే వేడుకలు. ఉద్యోగాలు, ఉపాధి, వ్యాపారాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లినవారు పండుగ సందర్భంగా స్వగ్రామాలకు చేరుకుంటారు. ముఖ్యంగా బతుకమ్మ సందర్భంగా ఆడపడుచులు పుట్టింటికి రావడంతో గ్రామాల్లో పాత జ్ఞాపకాలు, ఆత్మీయ పలకరింపులు, బంధుత్వాల సందడి కనిపిస్తుంది. గ్రామాలు, పట్టణాల్లో పండుగ ఏర్పాట్లు మొదలయ్యాయి. బతుకమ్మ ఆడే ప్రదేశాలను శుభ్రం చేయడం, ఆలయాలను విద్యుద్దీపా లతో అలంకరించడం, ఉత్సవ కమిటీల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. మార్కెట్లలో పూలకు డిమాండ్ పెరగడంతో పూల వ్యాపారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?

**(మొదటి పేజీ తరువాయి**

ఆయన ఆరోపించారు. వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా? అని ప్రశ్నించారు. ఫలితాలు వ్యతిరేకంగా వస్తే రాజ్యాంగ సంస్థలపై విష ప్రచారం చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయనప్పుడల్లా ఎన్నికల సంఘం, కాగ్, న్యాయవ్యవస్థ, పార్లమెంట్ వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం అలవాటుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు, రాజ్యాంగ సంస్థలు అవినీతిమయమయ్యాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలకు దిగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ కీలకమైన సంస్థలపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని దెబ్బతీసే లక్ష్యంతోనే కాంగ్రెస్ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

# 'సర్' అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి..
# సీఈసీ రాజీనామా చేయాలి: కేటీఆర్

**హైదరాబాద్ అక్టోబర్ 9(ప్రజావినికిడి):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. జరిగిన అక్రమాలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే సమయంలో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగానికి మించింది ఏదీ లేదని, ఏ ఒక్క భారత పౌరుడి ఓటు హక్కును హరించలేరని ఆయన



స్పష్టం చేశారు. ఒక వ్యక్తిని కాపాడటం కోసం 140 కోట్ల మంది భారతీయుల హక్కులను ఎలా కాలరాస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును బలహీనపరిచే కుట్రలపై న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ూ×= ప్రక్రియలో భాగంగా, ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించారని ఆయన ఆరోపించారు.

మరోవైపు, రేపు హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. ఈ ఆందోళనలను భవిష్యత్తులో ఢిల్లీకి కూడా విస్తరిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

# నవీ పిళ్లేకు నోబెల్ శాంతి పురస్కారం..

**భారత సంతతికి చెందిన దక్షిణాఫ్రికా న్యాయ నిపుణురాలు నవీ పిళ్లే**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9(ప్రజావినికిడి):**

అంతర్జాతీయ న్యాయం, మానవ హక్కుల కోసం దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న భారత సంతతి న్యాయమూర్తి నవనీతం 'నవీ' పిళ్లేను 2026 సంవత్సరానికి గాను అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం వరించింది. యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు, జాతి నిర్మూలన వంటి తీవ్రమైన అంశాలపై నేరస్థులను చట్టం ముందు నిలబెట్టేందుకు ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ఈ ప్రకటన చేసింది. అసాధారణమైన ధైర్యం, నైతిక నిబద్ధతతో ప్రపంచ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆమె పోషించిన పాత్రను కమిటీ కొనియాడింది.దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో వర్ణవివక్ష పాలనలో మగ్గుతున్న ఒక భారత తమిళ మూలాలు ఉన్న కుటుంబంలో నవీ పిళ్లే జన్మించారు. సమాజంలో పాతుకుపోయిన తీవ్రమైన వివక్ష, వేర్పాటువాదాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. వర్ణవివక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన నెల్సన్ మండేలా వంటి ఎందరో ఉద్యమకారులకు ఆమె న్యాయవాదిగా అండగా నిలిచారు. తన సుదీర్ఘ కెరీర్‌లో



ఆమె దక్షిణాఫ్రికా హైకోర్టు న్యాయమూర్తిగా, రువాండా అంతర్జాతీయ క్రిమినల్ ట్రైబ్యునల్ , అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు న్యాయమూర్తిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గానూ సేవలందించారు. ఇటీవల వరకు ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై యూఎన్ ఏర్పాటు చేసిన స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు అధ్యక్షత వహించారు. ప్రస్తుతం ఆమె మయన్మార్‌పై నమోదైన జాతి నిర్మూలన కేసులో అంతర్జాతీయ న్యాయస్థానం లో న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. రువాండా ట్రైబ్యునల్‌లో నవీ పిళ్లే పాత్ర చరిత్రాత్మకమైనది. అత్యాచారం, లైంగిక హింసను కేవలం సాధారణ నేరాలుగా కాకుండా, మానవత్వానికి వ్యతిరేక నేరాలుగా, జాతి నిర్మూలన చర్యగా పరిగణించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. కేవలం విద్వేషపూరిత ప్రచారం ద్వారా జాతి నిర్మూలనకు ప్రేరేపించారన్న ఆరోపణలపై ఒక నిందితుడిపై విచారణ జరగడంలోనూ ఆమె ప్రభావం ఉంది. ఇది అంతర్జాతీయ న్యాయ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

ప్రపంచంలో యుద్ధాలు, ఘర్షణలు పెరిగిపోతున్నాయని, అంతర్జాతీయ చట్టబద్ధ పాలన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని నోబెల్ కమిటీ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. అధికార రాజకీయాల ప్రాబల్యం పెరిగి, న్యాయ వ్యవస్థలు బలహీనపడుతున్నాయని పేర్కొంది. ఇలాంటి క్లిష్ట సమయంలో, శాంతికి న్యాయమే పునాది అని, అరాచకం, అధికార దర్పం మధ్య న్యాయాన్ని కాపాడే న్యాయమూర్తుల పాత్ర అత్యంత కీలకమని నొక్కి చెప్పింది. నవీ పిళ్లే వంటి ధైర్యవంతులు దేశాలను, నాయకులను జవాబుదారీగా నిలబెడుతూ, హింస బాధితులకు ఆశాకిరణంగా నిలుస్తున్నారని ప్రశంసించింది. ఆమె నిబద్ధత, స్వాతంత్ర్యం, అపారమైన అనుభవం ఆమెను మన కాలంలోని అత్యంత గౌరవనీయమైన అంతర్జాతీయ న్యాయవేత్తలలో ఒకరిగా నిలబెట్టాయని కమిటీ పేర్కొంది. ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆశయాలకు అనుగుణంగా దేశాల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడంలో ఆమె చేసిన కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడింది.

# కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా బీసీలకు 34% ఇస్తాం

**(మొదటి పేజీ తరువాయి**

టీడీపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం నర్సింగోలు గ్రామంలో మీభూమి-మీహక్కు కార్యక్రమం సందర్భంగా జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన రైతులు, మహిళలు, ప్రజలనుద్దేశించి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తాజా తీర్పుపై సభలో చంద్రబాబు స్పందించారు. సామాజికంగా, ఆర్థికంగా బీసీలను అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీనే అన్నారు. ఎన్టీఆర్ పాలనలో బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు ఇస్తే, తాను వచ్చాక 34 శాతం చేశానని, గత వైసీపీ ప్రభుత్వం దానిని 24 శాతానికి తగ్గించిందని విమర్శించారు. వైసీపీ నిర్వాకంతో 16,800 పదవులు బీసీలు కోల్పోయారన్నారు. తిరిగి కూటమి వచ్చాక 34 శాతం రిజర్వేషన్లను నిర్ణయిస్తే, దానిని వ్యతిరేకిస్తూ గొడ్డలి పార్టీ వాళ్లు కోర్టుకు వెళ్లారని అన్నారు. తొలి నుంచి గొడ్డలి పార్టీకి బీసీలంటే వ్యతిరేకత, చిన్నచూపే ఉందని విమర్శించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు 34 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చాయని, అయితే అంతకన్నా అధికంగానే పార్టీ పరంగా బీసీలకు సీట్లుఇచ్చి గెలిపిస్తామని చెప్పారు. స్థానిక ఎన్నికలంటేే గొడ్డలి పార్టీకి వెన్నులో వణుకు పుడుతోందని, ఎన్నికల్లో ఓటమి చెందాక గ్రామాల్లో వారి కార్యకర్తలు బయటకురారని భయపడుతూ ఎలాగోలా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. 'సర్'ను ఒకవైపు వ్యతిరేకిస్తూ మరోవైపు అది పూర్తయ్యాక ఎన్నికలు పెట్టాలని కోర్టుకు వెళ్లి రెండు నాల్కల ధోరణి ప్రదర్శించారని చంద్రబాబు విమర్శించారు.

### స్థానిక ఎన్నికల్లోనూ ఆశీర్వదించండి:

నీటి సౌకర్యంతో అభివృద్ధి సాధ్యమన్న చంద్రబాబు.. పట్టిసీమతో కృష్ణా డెల్టాకు గోదావరి నీరు తీసుకురావడం వల్ల శ్రీశైలం నుంచి వెలిగొండకు నీరివ్వగలిగామని వివరించారు. గోదావరి-కావేరి అనుసంధానర చేస్తే ఐదు రాష్ట్రాలు, ఐదు జీవనదులు అనుసంధానమై అన్ని ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ప్రధాని మోదీతోనూ ఈ విషయంపై చర్చించానని చెప్పారు. వెలిగొండ రెండోదశను కూడా రెండేళ్లలో పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు, సంపద వృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న మంచి ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. 'మంచి పని చేసేవారిని గుర్తిస్తే మంచి జరుగుతుంది. ఓసారి గత వైసీపీ పాలనను గుర్తుచేసుకోండి. అప్పట్లో ఎవరి మొహంలో నవ్వు అన్నది లేదు. ఇంట్లో, బయట కూడా భద్రత లేదు. ఎటుచూసిన విధ్వంసమే సాగింది. అలాంటి పరిస్థితి మళ్లీ రాష్ట్రానికి రాకూడదు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి అపూర్వ విజయం అందించినట్లు స్థానిక ఎన్నికల్లోనూ ప్రజలు ఆశీర్వదించండి' అని కోరారు.

### పొలం వెళ్లాలే కానీ ఆఫీసుల చుట్టూ కాదు

'గత ప్రభుత్వ హయాంలో ఎటుచూసినా భూవివాదాలు, ఆక్రమణలు, దందాలు సాగాయి. రీసర్వే పేరుతో అస్తవ్యస్తం చేశారు. రైతుల భూములపై నాయకుడి ఫొటో వేసుకొని పాసుపుస్తకాలు ఇచ్చారు. పొలంలో సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకొని రైతులకు అభద్రత కలిగేలా చేశారు. గిట్టనివారివి, తమకు డబ్బులివ్వనివారికి చెందిన భూములను 22(ఏ)లో పెట్టించి వేధించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటన్నింటిని గుర్తించి ప్రతి రైతు సమస్యనూ పరిష్కారం చేయడమే లక్ష్యంగా నిర్ణయం తీసుకున్నాం. రైతు హలం పట్టి పొలం వెళ్లాలే కానీ అర్జీ పట్టుకొని ఆఫీసులు చుట్టూ తిరిగే అవసరం రాకూడదు. అందుకోసం భూముల సర్వేలో జరిగిన అవకతవకలు, తప్పిదాలు సరిచేస్తూ రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలను మీభూమి- మీహక్కు కార్యక్రమంలో ఇస్తున్నాం. ఇప్పటి వరకు 40.58 లక్షల పాసుపుస్తకాలు ఇచ్చాం. మార్చి ఆఖరులోపు మరో 51.91 లక్షలు ఇవ్వనున్నాం. నవంబరులో 10.95 లక్షలు, డిసెంబరులో 9.90 లక్షలు, జనవరిలో 9.0 లక్షలు, ఫిబ్రవరిలో 7.70 లక్షలు, మార్చిలో 12.30లక్షల పాసుపుస్తకాలు ఇస్తాం. ఎవరూ ట్యాంపరింగ్ చేయకుండా ఉండే సాంకేతికత, క్యూఆర్ కోడ్‌లతో రాజముద్రతో ఇస్తున్నాం' అని అన్నారు.

# ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి

**(మొదటి పేజీ తరువాయి**

పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని పేర్కొంటూ ఒక విజ్ఞాపనపత్రం అందజేశారు. ఇండియా కూటమి ఎంపీలు దేశంలోని 60 శాతం జనాభాకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రపతిని కలవటానికి ముందు ఇండియా కూటమి ఎంపీలు 'ప్రజాస్వామ్యాన్ని రక్షించండి' అని రాసి ఉన్న భారీ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ పార్లమెంటు హౌస్ నుంచి విజయ్‌చౌక్ వరకూ ర్యాలీ జరిపారు. విజయ్‌చౌక్ వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం, రాష్ట్రపతి భవన్ నుంచి పిలుపు రావటంతో ఇండియా కూటమి నేతల బృందం రాష్ట్రపతి భవన్‌కు వెళ్లింది. ఈ బృందంలో రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే(కాంగ్రెస్), మమతా బెనర్జీ (తృణమూల్), ఒమర్ అబ్దుల్లా (ఎన్‌సీ), సుప్రియాసూలే (ఎన్సీపీ-పవార్), రాజీవ్‌రాయ్ (ఎస్పీ), మనోజ్‌ఝా (ఆర్జేడీ), తిరుమావలన్ (వీసీకే), డీ రాజా (సీపీఐ), ఎంఏ బేబి (సీపీఎం) ఉన్నారు. రాష్ట్రపతిని కలిసి విజ్ఞాపనపత్రం అందజేసిన అనంతరం తిరిగి వచ్చి మీడియాతో నేతలు మాట్లాడారు.

మోదీ, అమిత్‌షా, జ్ఞానేశ్‌కుమార్ కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసే కుట్ర పన్నారని రాష్ట్రపతికి తెలియజేశామని రాహుల్ పేర్కొన్నారు. 'మేం చెప్పినదాన్ని రాష్ట్రపతి ఎంతమాత్రం నిరాకరించలేదు. ప్రశ్నించలేదు కూడా. మా ఆరోపణలకు ఆధారాలు ఉంటే ఇవ్వమని అడిగారు' అని రాహుల్ తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను సోమవారం కలిసి విజ్ఞాపనపత్రం అందజేస్తామని వెల్లడించారు. ఖర్గే మాట్లాడుతూ, రాష్ట్రపతి అడిగిన ఆధారాల్ని తాము సమర్పిస్తామన్నారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్ని ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ పేపర్లతో నిర్వహించాలన్నారు.

### 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలి

ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతికి సమర్పించిన విజ్ఞాపనపత్రంలో పలు కీలక డిమాండ్లు చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తప్పించాలి, సీఈసీకి, ఎన్నికల మిషనర్లకు న్యాయవిచారణ నుంచి రక్షణ కల్పిస్తున్న 2023 నాటి చట్టాన్ని రద్దు చేయాలి, ఇకపై దేశంలో జరిగే అన్ని ఎన్నికలను బ్యాలెట్ పేపర్లతో నిర్వహించాలి, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలి, ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను తిరిగి ఆ జాబితాలో చేర్చాలి, గత రెండేళ్లలో జరిగిన అన్ని అసెంబ్లీల ఎన్నికల్ని రద్దు చేయాలి.. వీటిలో ఓట్ల చోరీ జరిగినట్లుగా స్పష్టమైన ఆధారాలున్నాయని పేర్కొన్నారు. కోట్లాది మంది భారతీయులకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన ఓటు హక్కును హరించటానికి యావత్ ఎన్నికల వ్యవస్థను, ప్రజాస్వామ్య వ్యవస్థలను మోదీ, అమిత్‌షా చెరబట్టారని ఆరోపించారు. 'హరియాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీసగఢ్, బిహార్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికను బీజేపీ దొంగిలించిందని, భారీ ఎత్తున ఓట్లచోరీ జరిగిందనటానికి తమ వద్ద తిరుగులేని ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ ఈవీఎంలను, ఓటర్ల జాబితాలను దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ఈ సంక్షోభ సమయంలో భారత రిపబ్లిక్ రాజ్యాంగ అధినేతగా తగిన చర్యలు తీసుకోవాలని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు..

### ఉద్యమిస్తే ప్రభుత్వ పతనం ఖాయం: రాహుల్

రాష్ట్రపతిని కలవటానికి ముందు ఇండియా కూటమి ఎంపీలు సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్‌హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. దేశంలో జ్ఞానేశ్‌కుమార్‌ను మించిన సమస్య ఉందని, దానిని పరిష్కరించాలంటే ప్రస్తుత ప్రభుత్వాన్నే తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. గత 3-4 రోజులుగా ఉద్యమిస్తున్న విధంగానే విపక్షాలు ముందుకు దూసుకెళ్తే మోదీ ప్రభుత్వం కుప్పకూలటం ఖాయమని చెప్పారు. విపక్షాల ఉద్యమంతో ప్రభుత్వ వణుకుతోందన్నారు. ఇదిలా ఉండగా, దేశంలో ప్రతి వ్యాపారానికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని రాహుల్ అన్నారు. క్రోనీ క్యాపిటలిజం(ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం) గొలుసును తెంచుతామని, వ్యాపారులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తామని ఆయన తెలిపారు

# చీకట్లో కాటేదాన్..

## పట్టించుకోని అధికారులు.!

### వెంటనే సమస్య పరిష్కరించాలి: బీఆర్ఎస్ నేత ఎస్.వెంకటేష్



**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 9,** కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్లలో వీధిలైట్లు పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం, మైలార్ దేవ్ పల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి వీధిలైట్ల సమస్యను గతంలోనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. బెంగళూరు హైవే నుంచి శిరాంపల్లి రైల్వే గేటు మీదుగా బాబులురెడ్డి నగర్ వరకు వీధిలైట్లు వెలగక రాత్రివేళల్లో రహదారులు చీకటిమయంగా మారుతున్నాయని తెలిపారు. దీంతో ప్రజలు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారని,మహిళలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చీకటిని ఆసరాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దోమల బెడద కూడా ప్రజలను వేధిస్తున్నదన్నారు.ఓవైపు ప్రజాపాలన, పండుగల నిర్వహణ గురించి గొప్పగా చెప్పుకుంటున్న ప్రభుత్వం.. మరోవైపు ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలైన వీధిలైట్లు ఏర్పాటు చేయడంలో విఫలమవుతున్నదని అయన విమర్శించారు. పనిచేయని లైట్లకు మరమ్మతులు చేయడంతోపాటు అవసరమైన చోట కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రానున్న బతుకమ్మ,దేవీ నవరాత్రుల ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని నగర కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. సంబంధిత సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరించి ప్రజలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎస్. వెంకటేష్ తెలిపారు.

# కాశీలో శ్రీ విశ్వప్రసన్న తీర్థ స్వామీజీని కలిసి ఆశీర్వాదం పొందిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** పవిత్ర పుణ్యక్షేత్రమైన కాశీలోని అస్సీ ఘాట్‌లో నిర్వహించిన గంగా హారతి కార్యక్రమం సందర్భంగా శ్రీ పెజావర్ మఠాధిపతి,శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ధర్మకర్త శ్రీ విశ్వప్రసన్న తీర్థ స్వామీజీ వారిని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా స్వామీజీతో కొద్దిసేపు ఆధ్యాత్మిక విషయాలపై మాట్లాడి,వారి ఆశీస్సులు,మార్గదర్శనం పొందారు.పవిత్ర గంగానది తీరంలో గంగా హారతి కార్యక్రమంలో పాల్గొనడం, ఆధ్యాత్మిక ప్రముఖుల ఆశీస్సులు పొందడం ఎంతో సంతోషాన్నిచ్చిందని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.భారతీయ సనాతన ధర్మం,ఆధ్యాత్మిక సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణలో సాధుసంతుల మార్గదర్శనం ఎంతో విలువైనదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.కాశీ క్షేత్ర సందర్శన,గంగా హారతి కార్యక్రమం తనకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయని పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి

### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కోరిన అభ్యర్థి



**రాజేంద్రనగర్,(ప్రజావినికిడి): అక్టోబర్ 9,** మహబూబ్‌నగర్‌రంగారెడ్డిహైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన అభ్యర్థిత్వానికి మద్దతు తెలపాలని ఎమ్మెల్యేను కోరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రుల ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు సహకరించాలని సామ రామ్మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని పట్టభద్రులను కలిసి తనకు ఓటు వేసి గెలిపించేలా తగిన సహకారం అందించాలని కోరారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బుల్లెట్ కలకలం

### పత్రాలు లేకుండా బుల్లెట్ తీసుకెళ్తున్న మహిళా ప్రయాణికురాలు





**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 9:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుల్లెట్ కలకలం రేపింది. ఇండిగో విమానంలో ముంబై వెళ్లేందుకు వచ్చిన ఓ మహిళా ప్రయాణికురాలి వద్ద సరైన పత్రాలు లేకుండా బుల్లెట్ లభించినట్లు సమాచారం. దీంతో అప్రమత్తమైన విమానాశ్రయ భద్రతా సిబ్బంది ఆమెను అదుపులోకి తీసుకుని, శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఔట్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఘటనపై పోలీసులు మహిళను విచారిస్తున్నారు. బుల్లెట్ ఆమె వద్దకు ఎలా వచ్చింది,దానిని ఎందుకు తీసుకెళ్తున్నారనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# రాజేంద్రనగర్‌లో రూ.2.51 కోట్లతో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం

### భవాని కాలనీ, ప్రేమావతిపేటలో రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన

**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి) అక్టోబర్ 9:** నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మరో అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని భవాని కాలనీ, ప్రేమావతిపేట (డివిజన్ నం.120, సర్కిల్-19)లోని పలు అంతర్గత వీధుల్లో రూ.2.51 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కాలనీల్లో అంతర్గత రహదారుల అభివృద్ధి ద్వారా స్థానికులకు మెరుగైన రవాణా సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. రహదారుల నిర్మాణంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తగ్గి, ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. కాలనీల్లో





మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా స్థానిక సమస్యల పరిష్కారానికి అవకాశం కలుగనుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టారు. సంబంధిత అధికారులు నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని స్థానికులు ఆశిస్తున్నారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# దండోరా ఉద్యమకారుడు శివశంకర్ మాదిగకు ఎంఆర్పీఎస్ నాయకుల ఘన నివాళి

### బాధిత కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయం అందజేత





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా ఎంఆర్పిఎస్ మాజీ కార్యదర్శి సోదరుడు, దండోరా ఉద్యమంలో నిబద్ధతతో పనిచేసిన ఉద్యమకారుడు బ్యాతాల శివశంకర్ మాదిగ గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన స్వగ్రామమైన టంగటూరులో ఎంఆర్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ రాగల్ల ఉపేందర్ మాదిగ మరియు ఇతర నాయకుల బృందం ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం అంతిమయాత్రలో పాల్గొని ఉద్యమ జోహార్లు అర్పించారు.

ఈ సందర్భంగా శివశంకర్ మాదిగ కుటుంబ సభ్యులను నాయకులు పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఉద్యమంలో ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ కుటుంబానికి అండగా నిలిచారు. ఎంఆర్పీఎస్ తరపున ప్రస్తుత ఖర్చుల నిమిత్తం రూ.40,000 ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో చేవెళ్ల కేంద్రంగా దండోరా ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన శివశంకర్ మాదిగ మరణం ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. ఉద్యమంలో శివశంకర్ అందించిన సేవలు, నాయకులతో ఆయనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారుశివశంకర్ మాదిగ భౌతికంగా తమ మధ్య లేకపోయినా, ఉద్యమంలో కలిసి నడిచిన జ్ఞాపకాలు, ఆయన చేసిన కృషి, ఉద్యమానికి అందించిన సేవలను ఎంఆర్పీఎస్ ఎప్పటికీ మరచిపోదని తెలిపారు. ఎంఆర్పీఎస్ నాయకుడు కృష్ణ మాదిగ అందుబాటులో లేకపోవడంతో, శివశంకర్ మృతి వార్త తెలుసుకున్న ఆయన ఫోన్ ద్వారా మృతుడి తల్లిదండ్రులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ ఎంఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షులు రావుగాళ్ల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ల నర్సింహా మాదిగ, కడిగాళ్ల ప్రవీణ్ మాదిగ,ఎంఎస్ ఎఫ్ నాయకుడు భాను మాదిగతో పాటు చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ మండలాల అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, జాతీయ,రాష్ట్ర, జిల్లా నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శివశంకర్ మాదిగకు నివాళులర్పించారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం..

### బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన..

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకొని, అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని తెలిపారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.





అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదయ్యేలా సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలే కీలకం

### ఎన్జీవోస్ కాలనీలో సీఐ పర్యటన భద్రతపై ప్రజలకు అవగాహన

### నేరస్తులకు చెక్ పెట్టే నిఘా నేత్రాలు..

### సీసీ కెమెరాలు..

### షాద్ నగర్ పట్టణ సీఐ సీతారాం..

**షాద్‌నగర్,(ప్రజావినికిడి): షాద్ నగర్** పట్టణంలోని9వ వార్డులో గల ఎన్జీవోస్ కాలనీలో పర్యటించిన పట్టణ సీఐ సీతారాం.కాలనీలో ఇటీవల చోటుచేసుకుంటున్న దొంగతనాల నేపథ్యంలో పట్టణ సీఐ సీతారాం కాలనీలోనీ ప్రజలకు అవగాహన కల్పించారు.దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు.

ఈ సందర్భంగా సీఐ సీతారాం మాట్లాడుతూ, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు (నిఘా నేత్రాలు) కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పట్టణంలో ఇటీవల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం





అవసరమని సూచించారు.

ముఖ్యంగా బంగారు ఆభరణాల దొంగతనాలు జరిగిన ప్రాంతాల్లో ఇళ్ల వద్ద,పరిసరాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితులను గుర్తించి కేసుల దర్యాప్తు చేయడంలో ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు.ప్రతి వీధి,ప్రధాన కూడళ్లతో పాటు కాలనీల్లోకి వచ్చే,వెళ్లే మార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించడం సులభమవుతుందని వివరించారు.సీసీ కెమెరాల నిఘా ఉండటం వల్ల దొంగతనాలకు పాల్పడే వారితో పాటు కిడ్నాప్ వంటి నేరాలకు పాల్పడేవారిలోనూ భయం ఏర్పడుతుందని సీఐ తెలిపారు. ఎన్జీవోస్ కాలనీ వాసులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

ప్రజలు తమ ఇళ్ల వద్ద తగిన భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

నేరాల నియంత్రణలో పోలీసులకు ప్రజలు సహకరిస్తే పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా ఉంటుందని సీఐ సీతారాం పేర్కొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# కుత్బుల్లాపూర్ ప్రజల ఆరోగ్య రక్ష..

**ఎమ్మెల్యే, బిఆర్ఎస్ఎల్పీ విప్ కేపీ.వివేకానంద్: మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు..**

**క్యాన్సర్ తో బాధపడుతున్న వ్యక్తికి మూడు విడతల్లో 10 లక్షల విలువ గల ఎల్ఓసి మంజూరు..**

**మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకుల చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేత..**



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
130-సుభాష్ నగర్ డివిజన్ సూరారం కు చెందిన కొడవాటి లక్ష్మీ నర్సింహ తండ్రి కె.శ్రీనివాస్ రావు గత కొన్నేళ్లుగా క్యాన్సర్ తో బాధపడుతున్నారు.ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ బాధితుడికి మెరుగైన వైద్యాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మొదటి విడతగా రూ.3,00,000/- లక్షలు,రెండవ విడతగా రూ.4,00,000/- లక్షలు మంజూరు కాగా తాజాగా మూడవ విడతగా రూ.3,00,000/- లక్షల రూపాయలను మంజూరు చేయించారు. కాగా శుక్రవారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకుల చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసి పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,కుత్బుల్లాపూర్ ప్రజల ఆరోగ్య రక్షకులు,ప్రజల బాగోగుల కోసం ప్రతీ క్షణం పనిచేసే నాయకులు మన ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ.వివేకానంద్ ని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, కట్టా సుందర్, సుకుమార్, విజయ్,ప్రభాకర్, శివ గౌడ్,ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# మీర్ పేట్ లో ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం..



**రంగారెడ్డి,(ప్రజావినికిడి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో, మాజీ ఎమ్మెల్యే కిచెన్నగారి లక్ష్మారెడ్డి సూచనల మేరకు,మీర్ పేట్ లోని 60వ డివిజన్ పరిధిలో ఉన్న సుభాష్ చంద్రబోస్ నగర్, ఆఫీసర్స్ కాలనీలో శుక్రవారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాసి గూడెం బల్వంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గజ్జల రామచందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మహిళలకు చీరలను అందజేశారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ,
ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ద్వారా మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరిగిందని తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్ నగర్ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,మంద బలరాం, కళావతి, సమరీన్ సుల్తానా,జహీర్, ఆర్పీ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ఎస్ఎస్‌యూఐ,యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు..

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. -కాంగ్రెస్ నాయకులు..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని బుగ్గారెడ్డి గార్డెన్స్‌లో ఎస్ఎస్‌యూఐ,యూత్ ఈకాంగ్రెస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ హాజరయ్యారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఈ సంబరాలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి.బతుకమ్మ పాటలు, పండుగ సందడి మధ్య పాల్గొన్న వారిలో పండుగ ఉత్సాహం వెల్లివిరిసింది.ఈ సందర్భంగా నాయకులు బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి,ప్రకృతిని ఆరాధించే సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేశంపేట మాజీ జడ్పీటీసీ విశాల శ్రావణ్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్,గిరిజన ఆదివాసి రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు నాయక్,కౌన్సిలర్ సి పెంటయ్య,
మురళీ మోహన్,కొప్పునూరి ప్రవీణ్, దిలీప్,రాజు నాయక్ ముబారక్ అలీ ఖాన్,చందు లాల్,బాలరాజు గౌడ్,కే కె కృష్ణ,కత్తి చంద్రశేఖరప్ప,గుట్ట రాజు,మధువులు,కరుణాకర్,మంగ మధు,యూత్ కాంగ్రెస్ జిల్లాకార్యదర్శినరేందర్,కళాశాల విద్యార్థులు మహిళలు,యువత తదితరులు పాల్గొన్నారు.



# భారత రాజ్యాంగాన్ని పాఠ్య పుస్తకాలలో చేర్చాలి.

**దీక్షలో పాల్గొన్న రావుల శేషగిరి..**




**కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):**
భారత రాజ్యాంగాన్ని పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని కోరుతూ రాజ్యాంగ అంజన్న నేతృత్వంలో ఏర్పాటైన దీక్ష శిబిరాన్ని ప్రారంభించిన బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్ వారితో కలిసి పాల్గొన్న బీజేపీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కొ కన్వీనర్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, గురూజీ రాష్ట నాయకుడు అశోక్,లక్ష్మణ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నాగోల్ పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

**రూ.17 వేల జరిమానా.**

**. బాధితురాలికి రూ.2 లక్షల పరిహారం..**



**నాగోల్,(ప్రజావినికిడి):**
అక్టోబర్ 9, నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి ఎల్బీనగర్ లోని రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. నిందితుడికి రూ.17,000 జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.2,00,000 పరిహారం చెల్లించాలని ఆదేశించింది.
నాగోల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 1173/2020గా నమోదైన ఈ కేసులో గుంజి కోటేశ్వర్‌రావు (28),తండ్రి దివంగత సుబ్బారావు, వృత్తి మేస్త్రీ, నివాసం నాగారం గ్రామం,కీసర మండలం, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా నిందితుడిగా ఉన్నాడు.ఈ కేసు సెషన్స్ కేసు నంబర్ 409/2021గా విచారణకు వచ్చింది.ఈ కేసులో అప్పటి ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ వి. అశోక్‌రెడ్డి, ఎల్బీనగర్ ఏసీపీ పి.శ్రీధర్‌రెడ్డి దర్యాప్తు నిర్వహించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు డి. రఘు,పి. సత్యనారాయణ, కృష్ణ ప్రసన్నలు ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. కేసు విచారణలో సీడీఓ ఎం.రాజు, సమన్ల విధులు నిర్వహించిన జి. వెంకటేశ్, డబ్ల్యూపీసీ చి. శివప్రియ,బ్రీఫింగ్ ఆఫీసర్ పి.శోభ, లైజన్ ఆఫీసర్ జి. మహేందర్, మానిటరింగ్ ఆఫీసర్ పి. నరసింహారెడ్డి ప్రాసిక్యూషన్‌కు సహకరించారు.

# ఎస్‌టీయూటీఎస్ 80 వసంతాల వేడుకల్లో కొండవీటి ఆరోగ్యానికి సత్కారం







**మెదక్,(ప్రజావినికిడి):**
ఎస్‌టీయూటీఎస్ 80 వసంతాల కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కొండవీటి ఆరోగ్యం, భుజాతలను ఎస్‌టీయూటీఎస్ మెదక్ జిల్లా, పాపన్నపేట మండల శాఖల పక్షాన ఘనంగా సత్కరించి చిరు జ్ఞాపికను అందజేశారు. సంఘం 80 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండల అధ్యక్షుడు బి. ఎల్లం,ప్రధాన కార్యదర్శి సి.హెచ్. బాలమల్లేష్, ఆర్థిక కార్యదర్శి ఎన్.రాజు,జిల్లా నాయకులు కె. వేణుగోపాల్, శర్వన్ తదితరులు పాల్గొన్నారు.

# బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

**సుల్తాన్ పల్లి, బురాన్ ఫామ్‌హౌస్ సమీపంలో ప్రమాదం**



**శంషాబాద్, (ప్రజావినికిడి):**
అక్టోబర్ 9,బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రాయికి తల తగలడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పెద్ద షాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుల్తాన్‌పల్లి గ్రామ సమీపంలో బురాన్ ఫామ్‌హౌస్ వద్ద గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షంషాబాద్ మండలం పరిధిలోని నర్కూడ గ్రామానికి చెందిన కమ్మరి హరీష్ చారి (31) వడ్రంగి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి సుమారు 10.30 గంటలకు తన బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. రాత్రి సమయంలో నర్కూడ గ్రామ శివారులో స్నేహితులు పవన్,గణేష్, మణి అలియాస్ మహేష్‌తో కలిసి మద్యం సేవించినట్లు సమాచారం. అనంతరం గణేష్,మహేష్ ఇళ్లకు వెళ్లిపోగా, పవన్‌ను తన బైక్‌పై సుల్తాన్‌పల్లిలో దింపాడు. సుల్తాన్ పల్లి నుంచి నర్కూడలోని తన ఇంటికి తిరిగి వస్తుండగా బురాన్ ఫామ్‌హౌస్ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు.ఈ క్రమంలో రోడ్డు పక్కన ఉన్న రాయికి తల,నుదురు బలంగా తగలడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం ఉదయం సుమారు 6 గంటలకు సుల్తాన్‌పల్లికి చెందిన దేవేందర్ ఈ విషయాన్ని హరీష్ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేశాడు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి తండ్రి కమ్మరి రాములు చారి ఫిర్యాదు మేరకు పెద్ద షాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బేవరేజెస్ కార్పొరేషన్‌కు అనుకూలంగా తీర్పు..



**నాంపల్లి, (ప్రజావినికిడి):**
ఉమ్మడి రాష్ట్రంలో ఇన్ కామ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ 2007లో ఆరు సంవత్సరాలకు సంబంధించిన ఇన్ కామ్ టాక్స్ పన్నులను రూ. 544 కోట్లను బేవరేజెస్ కార్పొరేషన్ చెల్లించాలని ఇన్ కామ్ టాక్స్ డిపార్ట్మెంట్ కోర్టులో కేసు వేశారు.రూ.544 కోట్లలో తెలంగాణ టీజీబీసీఎల్ రూ.226 కోట్లు చెల్లించాలని ఇన్ కామ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ కేసులో పేర్కొంది. ఈ కేసును తెలంగాణ అడ్వకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి వాదించారు. అడ్వకేట్ జనరల్ వాదనలు విన్న హైకోర్టు తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ కు ఈ కేసులో హై కోర్టు అనుకూలంగా తీర్పు వచ్చింది. రూ.226 కోట్లను ఇన్ కామ్ టాక్స్ డిపార్ట్ మెంట్‌కు టీజీబీసీఎల్ చెల్లించాల్సిన అవసరం లేదని హైకోర్టు తీర్పు వెలువరించింది. బేవరేజెస్ కార్పొరేషన్‌కు అనుకూలంగా తీర్పు వచ్చిన సందర్భంగా తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డిని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్, టీజీబీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సి.హరికిరణ్ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కమిషనర్ వెంట అసిస్టెంట్ కమిషనర్ (హెడ్‌కార్టర్స్) శీలం శ్రీనివాస రావు టీజీబీసీఎల్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) బి.అంశా ఉన్నారు.

# మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు ఎం.రాకేష్ ముదిరాజ్ నియామకం..

**నియామక పత్రాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపిన కోలన్ హన్మంత్ రెడ్డి..**



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, చింతల్ డివిజన్‌కు చెందిన ఎం.రాకేష్ ముదిరాజ్ మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి,షాల్వాతో సత్కరించారు.అనంతరం నియామక పత్రాన్ని హన్మంత్ రెడ్డి చేతుల మీదగా అందుకున్నారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ఎం.రాకేష్ ముదిరాజ్‌కు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని,విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ,విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని,ఎన్ఎస్ యుఐ సంస్థను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. అదేవిదంగా భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో ఉన్నత పదవులు చేపట్టి,ప్రజలకు విద్యార్థులకు సేవలందిస్తూ, రాజకీయంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

# చౌదర్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ



**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 9,** చౌదర్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లక్ష్మి లింగం, ఉపసర్పంచ్ సంతపురి ప్రేమ్ రాజ్ విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం, విద్యను ప్రోత్సహించడం లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారుయూనిఫామ్స్ పంపిణీతో విద్యార్థులకు తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మామిళ్ల సబిత, కుమ్మరి అరుణ, తాళ్ల జయమ్మ, బక్క రాజు, మామిళ్ల మల్లేష్, కుమ్మరి పెంటయ్య, కుమ్మరి లత, పల్లె విజయ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ వారోత్సవాలు మొక్కుబడిగా కాదు..

## క్షేత్రస్థాయిలో చట్టం అమలు కావాలి

**అధికారులకేనా ఆర్టీఐ అవార్డులు.. సామాజిక కార్యకర్తలకు గుర్తింపు ఏదీ.?**

**సమాచార హక్కు చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్న కార్యకర్తలనూ గుర్తించాలి: రాపోలు లింగస్వామి**



**హైదరాబాద్,(ప్రజావినికిడి): అక్టోబర్ 09,** సమాచార హక్కు చట్టం-2005 అమలులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ శాఖల అధికారులను అవార్డులకు ఎంపిక చేయడాన్ని స్వాగతిస్తున్నామని,అయితే ఏళ్ల తరబడి ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న సమాచార హక్కు కార్యకర్తలను ఎందుకు గుర్తించడం లేదని ఆర్టీఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు లింగస్వామి ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ, ఆర్టీఐ వారోత్సవాలను కేవలం ఉత్సవాలకే పరిమితం చేయకుండా, చట్టాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**అవగాహన కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం..**

సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి రెండు దశాబ్దాలకు పైగా గడుస్తున్నా, నేటికీ సామాన్య ప్రజలకు ఈ చట్టం అందని ద్రాక్షగానే మిగిలిపోతోందని లింగస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో సమాచార హక్కు చట్టం అంటే ఏమిటి.? దాని ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలేమిటి.? ప్రభుత్వ శాఖల నుంచి సమాచారాన్ని ఎలా పొందాలి.? అనే అంశాలపై కనీస అవగాహన కూడా చాలామందికి లేదన్నారు. ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ఆ దిశగా మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**అధికారులకే గుర్తింపా.. కార్యకర్తల సేవలు కనిపించవా?**

చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్న అధికారులను గుర్తించి అవార్డులు అందించడం మంచి పరిణామమేనని పేర్కొన్న ఆయన, అదే సమయంలో సంవత్సరాల తరబడి సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ, అవినీతి అక్రమాలను వెలుగులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్న ఆర్టీఐ కార్యకర్తల సేవలను కూడా ప్రభుత్వాలు గుర్తించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ వ్యవస్థలో పనిచేస్తున్న అధికారుల పనితీరుకు అవార్డుల ద్వారా గుర్తింపు లభిస్తున్నప్పుడు, ప్రజాహితం కోసం స్వచ్ఛందంగా పనిచేస్తున్న సామాజిక కార్యకర్తలకు ఎందుకు గుర్తింపు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.అవార్డులు అధికారులకే పరిమితం కాకుండా, సమాచార హక్కు చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్న కార్యకర్తలకూ అందాలి అని స్పష్టం చేశారు.

**మండల, జిల్లా,రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఇవ్వాలి**

సమాచార హక్కు కార్యకర్తలను మండల,జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తించి తగిన ప్రోత్సాహకాలు, పురస్కారాలు అందించాలని రాపోలు లింగస్వామి సూచించారు. ఇలా చేయడం వల్ల కార్యకర్తల్లో మరింత ఉత్సాహం పెరగడమే కాకుండా, చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ఆర్టీఐ వారోత్సవాల నిర్వహణకు నిజమైన సార్థకత రావాలంటే సభలు, సమావేశాలు నిర్వహించడంతో సరిపెట్టకుండా, ప్రతి గ్రామంలోనూ ప్రజలకు సమాచార హక్కుపై అవగాహన కల్పించాలని కోరారు. సమాచార హక్కు చట్టం కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా, సామాన్యుడి చేతిలో ప్రజాస్వామ్య ఆయుధంగా మారాలని, అందుకోసం ప్రభుత్వాలు, అధికారులు, స్వచ్ఛంద కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రాపోలు లింగస్వామి డిమాండ్ చేశారు.

# శాంతి నికేతన్ బ్లూమ్స్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**తెలంగాణ సాంస్కృతి సంప్రదాయానికి ప్రతిబింబం బతుకమ్మ**

**ఆటపాటలతో విద్యార్థుల సందడి**





**ఎల్బీనగర్,(ప్రజావినికిడి): అక్టోబర్9,**
తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక తెలంగాణకే ప్రత్యేకమైన పూలపండుగ, తెలంగాణలోని ప్రతి ఆడపడుచు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసే పండగే బతుకమ్మ.. ప్రపంచంలోనే ప్రకృతిలో సహజంగా లబించే రంగు రంగు పూలను దైవంగా బావించి పూలను పూలతొనే పూజించే ఏకైక పండగే బ్రతుకునిచ్చే బతుకమ్మ పండగ. మహిళలకు అత్యంత విశిష్ట మైన పండగ ఏ ఇంట్లో చూసిన పూల వనం గానే మారుతుంది. యువతులు ముత్తయిదువులు ఆడుతూ పాడుతూ మురిసిపోయే పండుగ బతుకమ్మ. హయత్ నగర్ లో శివం హిల్స్ లోని శాంతి నికేతన్ బ్లూమ్స్ స్కూల్ లో బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉపాద్యాయులు విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సాంప్రదాయబద్దంగా ఆటపాటలతో ఘనంగా జరుపుకున్నారు. సంవత్సరానికి ఒకసారి వచ్చే బతుకమ్మ పండుగ ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. మహిళలందరూ తీరొక్క పూలతో బతుకమ్మను అలంకరించి భక్తిభావంతో ఆడిపాడి అనంతరం బతుకమ్మను నిమజ్జనం చేస్తారు.పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా పోయిమీ అత్తింట బుద్దికలిగుండు అంటు బతుకమ్మను గంగమ్మ చెంతకు చేర్చి ముత్తయిదువులు వాయనాలు ఇచ్చుపుచ్చుకోని తన కుటుంబాన్ని చల్లగా చూడమ్మా అంటు వెనుదిరిగారు.గౌరమ్మను మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించి బతుకమ్మలను నిమర్జనం చేశారు. మమ్మల్ని సౌభాగ్యంగా ఉంచాలమ్మ అని కోరుకుంటూ మహిళలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాధ కృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం రావాణాసురిడి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రోహిణి ఉపాద్యాయులు ,విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వనస్థలిపురం జోన్ ప్రజా భద్రతే ప్రధాన లక్ష్యం..

**వనస్థలిపురం నూతన ఇన్‌చార్జిగా ఏసీపీ తాండ్ర కరుణాకర్ రావు బాధ్యతల స్వీకరణ..**




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
మల్కాజ్ గిరి పోలీస్ కమిషనరేట్ ఎల్బీనగర్ డిసిపి జోన్ వనస్థలిపురం నూతన ఏసీపీ ఇన్‌చార్జిగా తాండ్ర కరుణాకర్ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మల్కాజిగిరి క్రైమ్స్ అండ్ పీడీ సెల్ విభాగంలో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు వనస్థలిపురం ఏసీపీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. 1995 బ్యాచ్‌కు చెందిన కరుణాకర్ రావు గతంలో కరీంనగర్ ఏసీపీగా పనిచేశారు. పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో సేవలందించిన ఆయన గడిచిన రెండేళ్లుగా మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ లో క్రైమ్స్ అండ్ పీడీ సెల్ విభాగంలో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న క్రమంలో కమీషనరేట్ ఉన్నతాధికారులు తాజాగా వనస్థలిపురం ఇంచార్జ్ ఏసీపీగా కరుణాకర్ రావు అదనపు బాధ్యతలను అప్పజెప్పారు. మల్కాజ్ గిరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వనస్థలిపురం ఇన్చార్జ్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్ రావు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ,వనస్థలిపురం జోన్ లో ప్రజా భద్రతకు ప్రత్యేకమైనటువంటి భద్రతా చర్యలు చేపడతామన్నారు.ప్రస్తుతం పండుగల సమయం కావడంతో దసరా సెలవులకు ఊళ్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని, దసరా పండుగ సెలవుల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే ప్రజలు తమ ఇళ్ల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపేందుకు వెళ్లే సమయంలో దొంగతనాలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఇళ్లలో బంగారం,వెండి ఆభరణాలు, నగదు వంటి విలువైన వస్తువులను భద్రత లేకుండా ఉంచి వెళ్లకూడదని సూచించారు. ఇంటి తలుపులు, కిటికీలు పటిష్టంగా మూసి ఉన్నాయెా లేదో పరిశీలించుకోవాలని,ఎక్కువ రోజులు ఇంటికి దూరంగా ఉండాల్సి వస్తే నమ్మకమైన ఇరుగుపొరుగు వారికి సమాచారం అందించాలని తెలిపారు. పండుగ వేళ ప్రజల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని దొంగతనాలు జరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తగిన భద్రతా చర్యలు పాటిస్తూ దసరా పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. రాత్రి సమయంలో ప్రత్యేకమైనటువంటి గస్తీ ఏర్పాటు చేస్తామని, పోలీసులకు ప్రజలు సహకారం అందించినప్పుడే ప్రజాభద్రత మరింత పటిష్టమవుతుందన్నారు.ఫ్రెండ్లీ పోలీసింగ్ ను నూటికి నూరు శాతం అమలు చేయడంతో పాటు ఉన్నతాధికారుల ఆదేశానుసారం విధులు ఇస్తామని ఏసిపి పేర్కొన్నారు.ఈ సందర్భంగా వనస్థలిపురం జోన్ ప్రాంత ప్రజలకు ముందస్తుగా ఏసీపీ ప్రత్యేకంగా దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉప్పల్ స్టేడియంలో ఈ నెల 14న భారత్-వెస్టిండీస్ నాలుగో టీ20

**మ్యాచ్ నిర్వహణకు హెచ్‌సీఏ భారీ ఏర్పాట్లు..**

**-విద్యార్థులకు ఉచిత టికెట్లు**



**ఉప్పల్,(ప్రజావినికిడి):**
హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 14న భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య జరగనున్న నాలుగో టీ20 అంతర్జాతీయ మ్యాచ్ నిర్వహణకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రేక్షకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు హెచ్‌సీఏ సెక్రటరీ జీవన్ రెడ్డి వెల్లడించారు.విద్యార్థులు, సైనిక సిబ్బందికి ఉచిత టికెట్లు క్రికెట్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో పాఠశాల విద్యార్థులకు ఉచితంగా మ్యాచ్ టికెట్లు అందించనున్నట్లు హెచ్‌సీఏ తెలిపింది.భారత సైనిక సిబ్బంది కోసం 250 ఉచిత టికెట్లను కేటాయించింది. టీమిండియా, వెస్టిండీస్ జట్లకు ఘన స్వాగతం పలికేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది.అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సదుపాయాలుస్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నారు. డ్రెస్సింగ్ రూమ్‌లు, ప్రేక్షకుల సీటింగ్, వ్యూయింగ్ గ్యాలరీలను ఆధునికీకరిస్తున్నారు. వైద్య అత్యవసర సేవల కోసం అపోలో హాస్పిటల్స్‌తో హెచ్‌సీఏ భాగస్వామ్యం కుదుర్చుకుంది. అత్యవసర సమయాల్లో బాధితులను స్ట్రెచర్లపై సులభంగా తరలించేందుకు ప్రత్యేక ర్యాంప్‌ను నిర్మిస్తున్నారు.పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం గ్రీన్ క్రికెట్ కార్యక్రమంలో భాగంగా ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్‌ఈపీ)తో హెచ్‌సీఏ భాగస్వామ్యం ఏర్పరచుకుంది. ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేయడం, పర్యావరణహిత పద్ధతులను అమలు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.
పార్కింగ్, భద్రతకు ప్రత్యేక చర్యలు, స్టేడియం వద్ద పార్కింగ్ సామర్థ్యాన్ని గతంలో ఉన్న 4 వేల కార్ల నుంచి 4,500 కార్లకు పెంచినట్లు హెచ్‌సీఏ వెల్లడించింది. భద్రత,ట్రాఫిక్ నిర్వహణ కోసం మల్కాజ్‌గిరి పోలీసులతో సమన్వయం చేసుకుంటోంది. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రేక్షకులు వ్యక్తిగత వాహనాలకు బదులుగా మెట్రో రైలు సేవలను వినియోగించుకోవాలని హెచ్‌సీఏ విజ్ఞప్తి చేసింది. మ్యాచ్ రోజు రాత్రి ఒంటి గంట వరకు మెట్రో సేవలను పొడిగించాలని సంబంధిత అధికారులను కోరినట్లు తెలిపింది. మ్యాచ్ ప్రారంభానికి కనీసం రెండు గంటల ముందే ప్రేక్షకులు స్టేడియానికి చేరుకోవాలని సూచించింది.ఈ మ్యాచ్ కోసం సుమారు 34 వేల టికెట్లను విక్రయానికి అందుబాటులోకి తీసుకురానున్నారు. టికెట్ ధరలను కనిష్ఠంగా రూ.750, గరిష్ఠంగా రూ.20 వేలుగా నిర్ణయించారు. టికెట్ల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు ఒక లాగిన్ ద్వారా గరిష్ఠంగా నాలుగు టికెట్లు మాత్రమే కొనుగోలు చేసేలా పరిమితి విధించారు. టికెట్ జీనీ ద్వారా ఆన్‌లైన్‌లో క్యూఆర్ కోడ్‌తో కూడిన టికెట్లను విక్రయించనున్నారు. కొనుగోలుదారులు తమ టికెట్లను మరో మొబైల్‌కు బదిలీ చేసుకునే సదుపాయం కూడా కల్పించినట్లు హెచ్‌సీఏ వెల్లడించింది. మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), పోలీసు శాఖ, తెలంగాణ ప్రభుత్వానికి హెచ్‌సీఏ కృతజ్ఞతలు తెలిపింది. ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

# మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని డంపింగ్ యార్డ్ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..





**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
శుక్రవారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని డంపింగ్ యార్డ్ ప్రాంతంలో చుట్టుపక్కల దాదాపు ఇరవై కాలనీవాసులచే పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి వెంకట నరసయ్య చే కలిసి పర్యటించడం జరిగింది.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, ఇట్టి డంపింగ్ యార్డ్ నుంచి ప్రతిరోజు దుర్గంధమైన వాసన వస్తుందని సుధీర్ రెడ్డికి తెలిపారు.అట్టి వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న రక్తం,కొవ్వు పదార్థాలు,మురుగునీటి వల్ల పరిసర కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా వర్షం పడినప్పుడు ఈ వ్యర్థాలు కలుషితమై తీవ్ర దుర్వాసన వెలువడుతోందని దీని కారణంగా 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు శ్వాస సంబంధిత సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, దుర్వాసనను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఆరు కోట్ల రూపాయలతో స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు.ఇట్టి డంపింగ్ యార్డ్ నందు ఎక్కడెక్కడ నుంచో ట్యాంకర్లు వ్యర్థ రసాయనాలు తీసుకొచ్చి ఇక్కడ వదలడం జరుగుతుందని నా దృష్టికి తీసుకువచ్చిన నేపద్యంలో అప్పటి అధికారులతో మాట్లాడి సి.సి.కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది గుర్తు చేశారు.అలాగే ఇక్కడ చెత్త వేసే లారీలను గుర్తించి పెద్ద ఎత్తున జరిమానా విధించడం జరిగిందని తెలిపారు.అందులో భాగంగా గతంలో హైడ్రా,జీహెచ్ఎంసీ,ఫారెస్ట్,హైలా వంటి సంబంధిత శాఖాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అక్కడ నిల్వ ఉన్న మురికినీటిని తరలించేందుకు వెంటనే ట్యాంకర్లను ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు.అలాగే జంతు కళేబరాలు మరియు వ్యర్థ పదార్థాలు వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.ఆ ప్రాంతంలో ఎట్టి పరిస్థితుల్లోనూ దుర్వాసన రాకుండా పర్యవేక్షణను బలోపేతం చేసి దీనికి అనుగుణంగా అధికారులచే మోటార్లు ఏర్పాటు చేసి నిల్వ ఉన్న మురికినీటిని తరలించడం జరిగింది అని తెలిపారు.అలాగే ఆటో నగర్ పారిశ్రామిక ప్రాంతంలోని కెమికల్,ఫర్టిలైజర్ గోడన్స్,మెకనికల్ షెడ్డులు అన్నీ తనిఖీ చేసి ఎవరైతే డ్రైనేజీ లైన్ల ద్వారా వ్యర్థ పదార్థాలు,రసాయనాలు పారబోస్తున్నారో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.అలాగే అక్కడ ఒక వాచ్మెన్ కూడా గతంలో నియమించడం జరిగిందని తెలిపారు.అలాగే ఎస్టిపి ప్లాంట్స్ కూడా నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు.ఇప్పటివరకు దాదాపు 90 శాతం పనులు నేనే చేయడం జరిగిందని కాలనీవాసులకు గుర్తు చేశారు.కానీ కొందరు కాలనీవాసులు సుధీర్ రెడ్డి ని విమర్శిస్తూ ఏలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని కొన్ని గ్రూపులలో మాట్లాడడం తగదని హెచ్చరించారు.
కానీ ఏది ఏమైనా ఇట్టి డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల కాలనీవాసులకు దుర్వాసన నుంచి విముక్తి కలిగిస్తానని హామీ ఇస్తున్నాను.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విఠల్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి,టంగుటూరి నాగరాజు,జగదీష్ యాదవ్,జక్కిడి రఘువీర్ రెడ్డి,సంతోష్ గుప్తా,రవి,బాలరాజుతో పాటు డంపింగ్ యార్డ్ ప్రభావిత కాలనీల అధ్యక్షులు అంజయ్య గౌడ్,గోపికృష్ణరెడ్డి,రమేష్,రవి,విజయ,ప్రభాకర్,సాంబిరెడ్డి, రాజేష్,రంగారెడ్డి,వాసు యాదవ్,గాలయ్య,భాస్కర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బంగారం, వెండి దిగుమతులపై ఏప్రిల్ 1 నుంచి కొత్త పన్ను.. సామాన్యులపై భారం ఎంత?

**అక్టోబర్ 9(ప్రజావినికిడి):**
బంగారం, వెండి కొనాలనుకునేవారికి కీలక సమాచారం. 2027 ఏప్రిల్ 1 నుంచి బ్యాంకులు, ప్రభుత్వం గుర్తించిన సంస్థల ద్వారా దిగుమతి చేసుకునే బంగారం, వెండి, ప్లాటినంపై 3 శాతం ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐజీఎస్టీ) వర్తించనుంది. ఇప్పటివరకు కొన్ని బ్యాంకులు, గుర్తింపు పొందిన సంస్థలకు ఉన్న పన్ను మినహాయింపులను కేంద్ర ప్రభుత్వం పొడిగించకూడదని నిర్ణయించింది. ఈ మార్పుతో సామాన్యులు కొనుగోలు చేసే బంగారం, వెండి ధరలు పెరుగుతాయా? అని చాలా మందిలో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



రెవెన్యూ కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ గురువారం ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. పన్ను మినహాయింపులు 2027 మార్చి 31తో ముగియనున్నాయి. ఆ తర్వాత అర్హత కలిగిన దిగుమతులపై 3 శాతం ఐజీఎస్టీ అమల్లోకి వస్తుంది. దీంతో ఇప్పటివరకు మినహాయింపు పొందిన కొన్ని దిగుమతులపై అదనపు పన్ను భారం పడే అవకాశం ఉంది.

**మరి సామాన్యులపై ప్రభావం ఎంత?**
దిగుమతులపై పన్ను పెరగడం వల్ల బంగారం, వెండి కొనుగోలు వ్యయం పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ ప్రభావం మొత్తం వినియోగదారులపై ఎంతవరకు పడుతుందనేది దిగుమతిదారులు, వ్యాపారులు ఆ భారాన్ని ఎలా బదిలీ చేస్తారన్నదానిపై ఆధారపడి ఉంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు, రూపాయి మారకం విలువ, దేశీయ డిమాండ్ కూడా తుది ధరలను ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఈ నిర్ణయంతోనే బంగారం, వెండి ధరలు ఎంత పెరుగుతాయో ఇప్పుడే చెప్పలేం.
ఇప్పటికే బంగారం, వెండి దిగుమతులపై సుంకాల మార్పులు, అంతర్జాతీయ పరిణామాలు మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు భారత్ బంగారం దిగుమతుల విలువ 3.38 శాతం పెరిగి 17.47 బిలియన్ డాలర్లకు చేరింది. ఇదే సమయంలో వెండి దిగుమతుల విలువ 8.81 శాతం తగ్గి 1.74 బిలియన్ డాలర్లుగా నమోదైంది.
బంగారు ఆభరణాలు కొనేవారు, పెళ్లిళ్ల కోసం బంగారం కొనుగోలు చేయాలనుకునే కుటుంబాలు ధరల కదలికలను గమనించాల్సి ఉంటుంది. అయితే ఈ కొత్త పన్ను మార్పు 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుండటంతో, అప్పటివరకు ధరలు ఎలా మారతాయన్నది అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

# తెలుగు సాహితీ లోకంలో విషాదం.. ముదిగొండ ఇకలేరు

**అక్టోబర్ 9(ప్రజావినికిడి):**
ప్రముఖ చారిత్రక నవలా రచయిత, 'చారిత్రక నవలా చక్రవర్తి'గా ఖ్యాతి గడించిన ముదిగొండ శివప్రసాద్ (86) కన్నుమూశారు. గత ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు గురువారం రాత్రి గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 8:45 గంటల సమయంలో మరోసారి గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు. 1940 డిసెంబర్ 23న ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో జన్మించిన శివప్రసాద్, హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో ఆచార్యులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. తన సుదీర్ఘ సాహిత్య ప్రస్థానంలో ఆయన 80కి పైగా గ్రంథాలను రచించగా, వాటిలో 20కి పైగా చారిత్రక నవలలు ఉన్నాయి. కాకతీయ కళాదర్శనం, తంజావూరు విజయం, రెసిడెన్సీ, శ్రీలేఖ, ఆవాహన వంటి రచనలు తెలుగు సాహిత్యంలో విశేష ఆదరణ పొందాయి. భారత చరిత్రను, సంస్కృతిని తన రచనల ద్వారా సామాన్య పాఠకులకు చేరువ చేయడంలో ఆయన విశేష కృషి చేశారు. ఆయనకు కుమారుడు ఇందుశేఖర్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన భార్య కొన్నేళ్ల క్రితమే మరణించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు శివం రోడ్డులోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో గల ఆయన నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభమై, అంబర్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ముదిగొండ శివప్రసాద్ మరణం తెలుగు చారిత్రక సాహిత్య రంగానికి తీరని లోటని పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.



# బీసీల పేరుతో బిగ్ సౌండ్ !

## టీడీపీ వర్సెస్ వైసీపీ...



**అక్టోబర్ 9 (ప్రజావినికిడి):**
ఏపీలో బీసీల చుట్టూ రాజకీయం సాగుతోంది. మొత్తం జనాభాలో సగానికి పైగా బీసీలు ఉన్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అని టీడీపీ అధికారికంగా ప్రకటించడమే కాదు ఉత్తర్వులను కూడా విడుదల చేసింది. అయితే న్యాయ స్థానంలో మాత్రం కొంత ఇబ్బంది ఎదురవుతోంది. అయితే కోర్టు తీర్పులు ఎలా ఉన్నా బీసీలకు ఎక్కువ సీట్లనే పార్టీ పరంగా ఇవ్వడానికి టీడీపీ సిద్ధంగా ఉంది. వైసీపీ కూడా పార్టీ పరంగా తాము ఎక్కువ సీట్లే ఇస్తామని చెబుతోంది.
ఈ విధంగా బీసీల మద్దతు కోసం రెండు పార్టీలు పోటీ పడుతున్నాయి. అంతే కాదు బీసీలకు తాము ఎక్కువ మేలు చేశామని చెప్పుకుంటూ క్రెడిట్ వార్ కి తెర తీశాయి. బీసీలను ఆకట్టుకోవడానికి పార్టీ పరంగా సభలు నిర్వహిస్తున్నాయి. టీడీపీ గత నెలలో అయితే నర్శీపట్నం వేదికగా బీసీ జయభేరీ పేరుతో ఒక భరీ సభను నిర్వహించింది. రాజ్యసభ ఎంపీ అయిన చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో ఈ సభను నిర్వహించి బీసీలంతా మా వైపే అని సంకేతాలు ఇచ్చారు. ఇపుడు వైసీపీ వంతు వచ్చింది అని అంటున్నారు. తాజాగా ఆ పార్టీకి చెందిన బీసీ నేతలు అంతా విశాఖలో కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఉత్తరాంధ్రా స్థాయిలో పెద్ద ఎత్తున బీసీల సభ నిర్వహించాలని నిర్ణయించారు. దానికి బీసీ గర్జన పేరుని కూడా ఖరారు చెశారు.
బీసీ గర్జనలను 2019 ఎన్నికలకు ముందు వైసీపీ ఏపీవ్యాప్తంగా నిర్వహించింది దాంతో మంచి స్పందన రావడమే కాదు ఆ ఎన్నికల్లో బీసీలు వెన్నంటి నిలిచారు. దాంతో ఉత్తరాంధ్రా జిల్లాలో నూటికి ఎనభై శాతం పైగా సీటు షేర్ ని వైసీపీ దక్కించుకుంది. ఈసారి కూడా అదే సెంటిమెంట్ ని పార్టీ నమ్ముకుంది అని అంటున్నారు. బీసీ గర్జనని విశాఖ వేదికగా నిర్వహించేందుకు వైసీపీ సన్నాహాలు చేస్తోంది. ఉత్తరాంధ్రాలోని మూడు ఉమ్మడి జిల్లాలలో బీసీలు నూటికి ఎనభై శాతానికి పైగా ఉన్నారు. దాంతో బీసీలను ఆకట్టుకోవడానికి వైసీపీ చూస్తోంది అని అంటున్నారు. ఈ సభ ద్వారా వైసీపీ హయాంలో తాము ఏమి చేశామన్నది చెప్పడమే కాదు రెండేళ్ల కూటమి పాలనలో పెద్దగా చేసింది ఏమీ లేదని వైసీపీ నేతలు చెప్పదలచుకున్నారు అని అంటున్నరు.

**బీసీలు ఎటు వైపు :**
ఏపీలో బీసీ ఓట్లు ఏ పార్టీకి గుత్త మొత్తంగా ఎపుడూ పడిన దాఖలాలు లేవు, కాంగ్రెస్ టీడీపీ మధ్య రాజకీయ పోరాటం సాగినపుడు కూడా రెండు పార్టీల వైపుగానే చీలిపోతూ వచ్చారు. అయితే ఏపీ రాజకీయ చరిత్ర తీసుకుంటే బీసీలు అత్యధిక సార్లు ఎక్కువ శాతం టీడీపీ వైపే నిలబడ్డారు. బీసీల పార్టీగా అందుకే ఆ పార్టీ క్లెయిం చేసుకుంటూ ఉంటుంది. టీడీపీలో అనేక పదవులలో ప్రముఖ బీసీ నాయకులు ఫోర్ ఫ్రంట్ లో ఉండడం కూడా బీసీలను ఆకర్షిస్తోంది. ఇక బీసీల గొంతుక టీడీపీలో బలంగానే వినిపిస్తోంది. ఇపుడు వైసీపీ కూడా అదే స్ట్రాటజీని అమలు చేస్తోంది. తమ పార్టీలో కూడా బీసీ నాయకులు సొంత గొంతుకను గట్టిగా వినిపించాలని ప్లాన్ చేస్తోంది. ఈ క్రమంలోనే ఉత్తరాంధ్రా బీసీ గర్జనను నిర్వహిస్తున్నారు. మరి బీసీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరు వైపు మెజారిటీ ఉంటారు అన్నది చూడాలి.

# దసరా పండుగ సందడి.. కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్

**అక్టోబర్ 9(ప్రజావినికిడి):**
దసరా పండుగ సెలవులు ప్రారంభం కావడంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. తెలంగాణలో పాఠశాలలకు శనివారం నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో, శుక్రవారం సాయంత్రం నుంచే సొంతూళ్లకు వెళ్లేవారి సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. నగరంలోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. కుటుంబ సభ్యులు, విద్యార్థులతో బస్టాండ్ల ప్రాంగణాలన్నీ సందడిగా మారాయి. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యార్థం అక్టోబర్ 18వ తేదీ వరకు మొత్తం 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక సర్వీసుల్లో అత్యధికంగా కరీంనగర్ జోన్ నుంచి 3,533 బస్సులు నడుస్తుండగా, హైదరాబాద్ జోన్ నుంచి 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 బస్సులు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీ నగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాల నుంచి కూడా ఈ ప్రత్యేక సర్వీసులు నడుస్తున్నాయి. అయితే, ఈ ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ఛార్జీలను 1.5 రెట్లు (50 శాతం అదనంగా) పెంచినట్లు టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే అక్టోబర్ 9, 10, 16, 17 తేదీలతో పాటు, తిరుగు ప్రయాణ రద్దీ ఉండే అక్టోబర్ 25, 26 తేదీల్లో ఈ పెంచిన ఛార్జీలు వర్తిస్తాయి. సాధారణ బస్సు సర్వీసుల్లో ఛార్జీలలో ఎలాంటి మార్పు లేదని, 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన బస్టాండ్లలో తాత్కాలిక షెల్టర్లు, తాగునీటి సౌకర్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, మొబైల్ టాయిలెట్లను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. సెలవుల అనంతరం తిరుగు ప్రయాణ రద్దీని కూడా దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న మార్గాల్లో అవసరాన్ని బట్టి అదనపు బస్సులను నడుపుతామని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# భారత నిపుణులు 'వెట్టిచాకిరీ బానిసలా'?

## జేడీ వాన్స్ వ్యాఖ్యలపై భారత్ తీవ్ర ఆగ్రహం

**భారత ఐటీ నిపుణులను 'వెట్టిచాకిరీ బానిసలు' అన్న అమెరికా జేడీ వాన్స్**

**8 ప్రముఖ ఐటీ కంపెనీల గ్రీన్ కార్డ్ ప్రక్రియను నిలిపివేసిన అమెరికా**

**జేడీ వాన్స్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం, అవమానకరం అన్న భారత విదేశాంగ శాఖ**

**భారత నిపుణులు అమెరికా అభివృద్ధిలో కీలక భాగస్వాములని స్పష్టీకరణ**

**ఈ నిర్ణయం ఇరు దేశాల ఉమ్మడి లక్ష్యాలకు విఘాతమని భారత్ వ్యాఖ్య**



**అక్టోబర్ 9(ప్రజావినికిడి):**
భారత ఐటీ నిపుణులను 'విదేశీ వెట్టిచాకిరీ బానిసలు' అంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలు అత్యంత అనుచితమని, భారతీయ నిపుణులను అవమానించేలా ఉన్నాయని పేర్కొంది. ఎనిమిది ప్రముఖ టెక్నాలజీ సంస్థలకు సంబంధించి పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రక్రియను అమెరికా నిలిపివేసిన నేపథ్యంలో ఈ వివాదం చెలరేగింది.
అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ వేతనాలకు హెచ్-1బీ వీసాదారులను నియమించుకుంటున్నారన్న ఆరోపణలతో మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో సహా ఎనిమిది దిగ్గజ సంస్థలపై అమెరికా కార్మిక శాఖ ఈ చర్యలు చేపట్టింది. ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ మాట్లాడిన జేడీ వాన్స్, కంపెనీలు స్థానిక అమెరికన్ల కంటే తక్కువ వేతనాలకు లభించే విదేశీ నిపుణులకే ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఆయన భారతీయ నిపుణులను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.
జేడీ వాన్స్ వ్యాఖ్యలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూా) తీవ్రంగా ఖండించింది. "ఇలాంటి పదజాలం వాడటం అనవసరం. ఇది బాధాకరమైన వలసవాద చరిత్రను గుర్తుచేస్తోంది. ఇది తీవ్రంగా అవమానపరిచే చర్య" అని ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. అమెరికాలో సేవలందిస్తున్న భారతీయ నిపుణులు అత్యంత విద్యావంతులని, మేధావులని, ఆ దేశ ఆర్థికాభివృద్ధికి, నూతన ఆవిష్కరణలకు వారు ఎంతో దోహదపడుతున్నారని భారత్ ఈ సందర్భంగా గుర్తుచేసింది. అంతేకాకుండా, లేబర్ సర్టిఫికేషన్ ప్రక్రియ నిలిపివేతకు, హెచ్-1బీ వీసాలకు నేరుగా సంబంధం లేదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వల్ల ప్రస్తుతం ఉన్న వీసాదారులపై తక్షణ ప్రభావం ఉండకపోయినప్పటికీ, ఆయా కంపెనీల్లో పనిచేసే వారి గ్రీన్ కార్డ్ దరఖాస్తులపై ప్రభావం పడే అవకాశం ఉందని వివరించింది. నైపుణ్యం కలిగిన మానవ వనరుల రాకపోకలు ఇరు దేశాలకూ ప్రయోజనకరమని, అమెరికా తీసుకున్న ఇటువంటి చర్యలు ఉమ్మడి లక్ష్యాలకు విఘాతం కలిగిస్తాయని భారత్ పేర్కొంది. ప్రస్తుతం అమెరికాలో సుమారు 52 లక్షల మంది భారత సంతతి ప్రజలు ఉన్నట్లు అంచనా వేస్తూ, తాజా పరిణామాలను నిశితంగా గమనిస్తున్నట్లు భారత్ వెల్లడించింది.

# నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు.. యోగి సర్కారు కీలక నిర్ణయం!



**అక్టోబర్ 9(ప్రజావినికిడి):**
ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం'గా పిలవనున్నారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మొత్తం 39 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన యోగి.. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌తో ప్రధానికి ప్రత్యేక అనుబంధం ఉందని, వారణాసి నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందని చెప్పారు. 2017కు ముందు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉండేవని యోగి పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులు, మెట్రో, రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థలతో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్ అభివృద్ధి వంటి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. జెవార్‌లో నిర్మిస్తున్న నోయిడా విమానాశ్రయం ఉత్తర్‌ప్రదేశ్‌కు అందించిన గొప్ప బహుమతిగా యోగి అభివర్ణించారు. ఇది భవిష్యత్తులో దేశంలోనే కీలక విమానయాన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విమానాశ్రయం తొలి దశను ప్రధాని మోదీ ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. మొదటి దశలో ఏడాదికి సుమారు 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉండనుంది. నాలుగు దశల నిర్మాణం పూర్తయితే ఆసియాలోనే అతిపెద్ద విమానాశ్రయాల్లో ఒకటిగా నిలవనుంది.

# రెండో వన్డేలో భారత కుర్రాళ్ల ఓటమి

పుదుచ్చేరి : భారత పర్యటనలో ఉన్న ఆస్ట్రేలియా-ఏ జట్టు వన్డే సిరీస్‌లో అదరగొట్టింది. మూడు వన్డే సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే ఆతిథ్య జట్టును చిత్తుచేసి సిరీస్‌ను చేజిక్కించుకుంది.గురువారం జరిగిన రెండో వన్డేలో కంగారూలు నిర్దేశించిన 276 పరుగుల ఛేదనలో భారత్-ఏ.. 45.2 ఓవర్లలో 206కే ఆలౌటై 69 రన్స్ తేడాతో ఓడింది. రజత్ పటీదార్ (67) రాణించినా మిగిలిన బ్యాటర్లు నిరాశపరచడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు.



# చితక్కొట్టిన శాంసన్, తిలక్, అయ్యర్.. రాంచీలో విండీస్ ముందు కొండంత లక్ష్యం..!

రాంచీ టీ20లో భారత కుర్రాళ్లు కుమ్మేశారు. ఓపెనర్ సంజూ శాంసన్(82) మెరుపు ఆరంభాన్ని కొనసాగిస్తూ.. మిడిలార్డర్ బ్యాటర్లు ఎడాపెడా దంచేశారు. సుడిగాలి ఇన్నింగ్స్ ఆడిన ఇషాన్ కిషన్(43), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(40)లు వెస్టిండీస్ బౌలర్లను చితక్కొట్టారు. 'నేనేం తక్కువా' అన్నట్టు తిలక్ వర్మ(44 నాటౌట్) డెత్ ఓవర్లలో సిక్సర్లతో హోరెత్తించాడు. సంజూ, ఇషాన్‌ల దూకుడుతో పవర్ ప్లేలో విండీస్‌పై రికార్డు స్కోర్ బాదిన టీమిండియా.. అయ్యర్, తిలక్‌ల జోరుతో నిర్ణీత ఓవర్లలో 249 రన్స్ కొట్టింది.టీ20 సిరీస్‌లో అదిరే బోణీ కొట్టిన భారత్.. రెండో మ్యాచ్‌లో భారీస్కోర్ చేసింది. ఫామ్ చాటుకుంటూ ఓపెనర్ సంజూ శాంసన్(82) రెండో టీ20లో సునామిలా వెస్టిండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. యథేచ్ఛగా ఆడుతున్న శాంసన్.. 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో చెలరేగగా పవర్ ప్లేలో భారత్ రన్స్ కొట్టింది. అకీల్ హోసేన్ ఓవర్లో వరసగా 4, 6, 6, 4తో 22 పరుగులు పిండుకున్న సంజూ.. షెపర్డ్ వేసిన ఆరో ఓవర్లో బ్యా?్యక్ టు బ్యాక్ బౌండరీలతో అర్ధ శతకం సాధించాడు. దాంతో పవర్ ప్లేలో 79 రన్స్ చేసింది ఇండియా. ఫలితంగా ఈ ఫార్మాట వెస్టిండీస్‌పై గతంలో అత్యధిక స్కోర్‌గా ఉన్న 72 పరుగుల రికార్డు బద్ధలైంది. అభిషేక్ శర్మ(20) ఔటయ్యాక దూకుడు పెంచిన సంజూకు ఇషాన్ కిషన్(43) అగ్నికి వాయువులా తోడయ్యాడు. దంచికొడుతున్న ఇషాన్‌ను ఔట్ చేసిన రోస్టన్ ఛేజ్(3-24)..ఆ తర్వాతి ఓవర్లో శివం దూబే(7)ను పెవిలియన్ చేర్చాడు. కానీ, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(40), తిలక్ వర్మ(44 నాటౌట్) పిడుగల్లే విండీస్ బౌలర్లపై పడ్డారు. దాంతో.. డెత్ ఓవర్లలో వీరి వీరకొట్టుడుకు విండీస్ బౌలర్లు బలవ్వగా.. ఏకంగా 80 రన్స్ వచ్చాయి. టాపార్డర్ సమిష్టిగా రాణించడంతో నిర్ణీత ఓవర్లలో టీమిండియా వికెట్ల నష్టానికి పరుగులు చేసింది.



# ఆస్ట్రేలియా తడబాటు.. తొలి ఇన్నింగ్స్‌లో 187/6.. ఆదుకున్న రెన్‌షా, కమిన్స్

దర్బన్ : ఆరేండ్ల క్రితం ప్రపంచ క్రికెట్‌ను షాక్‌కు గురిచేసిన 'శాండ్‌పేపర్ గేట్' వివాదం తర్వాత దక్షిణాఫ్రికాలో మొదటి టెస్టు ఆడుతున్న ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో తడబడింది. కింగ్స్‌మీడ్ మైదానంలో సఫారీ పేసర్లు నిప్పులు చెరగడంతో కంగారూ టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్ తేలిపోయింది. శు క్రవారంతొలిరోజు వెలుతురు లేమి కారణంగా ఆట నిలిచే సమయానికి ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆసీస్ 65.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 187 రన్స్ చేసింది.సౌతాఫ్రికా పేస్ త్రయం మార్కో యాన్సెన్ (2/35), వియాన్ మల్డర్ (2/31), చాలాకాలం తర్వాత టెస్టు జట్టులో చోటు దక్కించుకున్న ఆన్రిచ్ నోకియా (2/40) కంగారూలను క్రీజులో నిలువనీయలేదు. లబూషేన్ (37), స్టీవ్ స్మిత్ (25) ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టే యత్నం చేసినా ఆరు బంతుల వ్యవధిలో ఈ జోడీ నిష్క్రమించడంతో ఆసీస్‌కు కష్టాలు రెట్టింపయ్యాయి. ఒకదశలో 124 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన కంగారూలను రెన్‌షా (46 బ్యాటింగ్), కెప్టెన్ కమిన్స్ (33 బ్యాటింగ్) ఆదుకున్నారు.



# శాంసన్ మెరుపు ఫిఫ్టీ.. పవర్ ప్లేలో విండీస్‌పై రికార్డు స్కోర్..!

రాంచీలో ఓపెనర్ సంజూ శాంసన్(74 నాటౌట్) దంచేస్తున్నాడు. వెస్టిండీస్ బౌలర్ల భరతం పట్టిన సంజూ 21 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. మరో ఎండ్‌లో ఇషాన్ కిషన్(43 నాటౌట్) సైతం బ్యాట్ ఝులిపించగా టీమిండియా స్కోర్ బోర్డు పరుగులు తీసింది. వీరిద్దరి విధ్వంసంతో పవర్ ప్లేలో విండీస్‌పై అత్యధిక స్కోర్ నమోదు చేసింది మెన్ ఇన్ బ్లూ.ఫామ్ అందుకున్న సంజూ శాంసన్(74 నాటౌట్) రెండో టీ20లో ఎడాపెడా బౌండరీలతో విరుచుకుపడుతున్నాడు. రాంచీలో యథేచ్ఛగా ఆడుతున్న శాంసన్.. 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో చెలరేగగా పవర్ ప్లేలో భారత్ రన్స్ కొట్టింది. అకీల్ హోసేన్ ఓవర్లో వరసగా 4, 6, 6, 4తో 22 పరుగులు పిండుకున్న సంజూ.. షెపర్డ్ వేసిన ఆరో ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ బౌండరీలతో ఈ ఫార్మాట్‌లో 11వ అర్ధ శతకం సాధించాడు.శాంసన్ జోరుతో పవర్ ప్లేలో 79 రన్స్ చేసింది ఇండియా. ఫలితంగా ఈ ఫార్మాట వెస్టిండీస్‌పై గతంలో అత్యధిక స్కోర్‌గా ఉన్న 72 పరుగుల రికార్డు బద్ధలైంది. అభిషేక్ శర్మ(20) ఔటయ్యాక దూకుడు పెంచిన సంజూకు ఇషాన్ కిషన్(43 నాటౌట్) అగ్నికి వాయువులా తోడయ్యాడు. దాంతో..11 ఓవర్లలో 139 టీమిండియా రన్స్ కొట్టింది.






# చోళ చీఫ్స్ బోణీ

ప్రీమియర్ లీగ్ (రెండో సీజన్ లో చోళ చీఫ్స్ జట్టు బోణీ కొట్టింది. పీపుల్స్ ప్లాజా వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో చోళ జట్టు 6-2 తేడాతో కాకతీయ నైట్స్ జట్టును ఓడించింది. చోళ జట్టు విజయంలో కొలంబియా ఆర్చర్ అలెజాండ్రా ఉస్కియానో కీలక పాత్ర పోషించింది. ఏపీఎల్‌లో అరంగేట్రం చేసిన అలెజాండ్రా తన ఎనిమిది బాణాలకు పర్ఫెక్ట్ 10 పాయింట్ల టార్గెట్‌పైకి పంపి సంచలనం సృష్టించింది.చివరి సెట్‌లో చోళ 80గానూ 79 పాయింట్లు సాధించడం విశేషం. ఇతర మ్యాచ్‌ల్లో చీరో ఆర్చర్స్ 6-2తో రాజ్‌పుతానా రాయల్స్‌పై, పృథ్వీరాజ్ యోధాస్ 6-2తో మైటీ మరాఠాస్‌ను ఓడించాయి. శనివారం జరిగే మ్యాచ్‌ల్లో మరాఠాస్‌తో చోళ, యోధాస్‌తో చీరో ఆర్చర్స్, రాయల్స్‌తో కాకతీయ పోటీపడతాయి.

# మానవ్ జోడీ నిష్క్రమణ

బీజింగ్ : డబ్ల్యూటీటీ చైనా స్మాష్ టీటీ టోర్నీలో భారత పురుషుల డబుల్స్ ద్వయం మానవ్ ఠక్కర్- మనుష్ షా సెమీఫైనల్స్‌లో ఓడిపోయింది. శుక్ర వారం జరిగిన సెమీస్‌లో 8-11, 6-11, 3-11తో లిమ్ జొంగ్‌హూన్-జున్‌సంగ్ (సౌత్ కొరియా) చేతిలో పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లో మనుష్-దివ్య జంట కూడా సెమీస్‌లోనే ఓడింది.



## రజనీ 'జైలర్ 2' నుంచి 'వన్ నేమ్' వీడియో సాంగ్ విడుదల..




సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న భారీ చిత్రం 'జైలర్ 2' నుంచి మరో క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఇప్పటికే లిరికల్ వీడియోతో చార్ట్‌బస్టర్‌గా నిలిచిన 'వన్ నేమ్' పాట పూర్తి వీడియోను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. సినిమా విడుదలకు సరిగ్గా వారం రోజుల ముందు ఈ మాస్ సాంగ్ వీడియోను రిలీజ్ చేయడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది.

ఈ వీడియోలో పాట చిత్రీకరణకు సంబంధించిన మేకింగ్ దృశ్యాలను కూడా జతచేయడం విశేషం. రజినీకాంత్ స్టైలిష్ లుక్స్, సెట్స్‌లో ఆయన హుషారు, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ స్టూడియోలో పనిచేస్తున్న విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. గత నెల సెప్టెంబర్ 29న విడుదలైన 'వన్ నేమ్' లిరికల్ సాంగ్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. రజినీకాంత్ పాత్రను ఎలివేట్ చేస్తూ సాగే ఈ పాటకు అనిరుధ్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు వీడియో రూపంలోనూ ఈ పాట అంచనాలను మించి అలరిస్తోంది.

గతేడాది బ్లాక్‌బస్టర్ హిట్టయిన 'జైలర్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రజినీకాంత్‌తో పాటు బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, విద్యా బాలన్, ఎస్‌జే సూర్య, రమ్యకృష్ణ, యోగిబాబు, మిర్నా మీనన్ వంటి భారీ తారాగణం ఈ చిత్రంలో నటిస్తోంది.'జైలర్ 2' చిత్రాన్ని అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సినిమా విడుదలకు ముందు ఈ వీడియో సాంగ్ ప్రమోషన్స్‌కు మరింత ఊపునిస్తుందని చిత్రవర్గాలు భావిస్తున్నాయి.

# శర్వానంద్ 'భోగి' నుంచి ఫస్ట్ సింగిల్..

## ఆకట్టుకుంటున్న 'ఎగిలివారంగ' గీతం

చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోగి'. ఇప్పటికే విడుదలైన టీజర్‌తో భారీ అంచనాలను నెలకొల్పిన ఈ చిత్రం నుంచి చిత్ర బృందం మ్యూజికల్ ప్రమోషన్లను ప్రారంభించింది. ఇందులో భాగంగా 'ఎగిలివారంగ' అనే తొలి పాటను ఈ రోజు (అక్టోబరు 9) విడుదల చేసింది. ఈ జానపద గీతం సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ పాటకు ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్ సాహిత్యం అందించారు. నల్గొండ గద్దర్ నరసన్న, కందుకూరి శంకర్ బాబు, రేలారే గోపాల్ తమ గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. ఈ పాటను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్న దర్శకుడు సంపత్ నంది, ఇది కేవలం పాట కాదని, ఒక మధురమైన జ్ఞాపకం అని అభివర్ణించారు. "బోసన్న భావాలు.. భీమ్స్ రాగాలు.. కలిసి.. ఇది పాట మాత్రమే కాదు ప్రతీ పల్లె ఆత్మను పలకరించే ఓ మధురమైన జ్ఞాపకం" అని ఆయన పేర్కొన్నారు. విడుదల చేసిన పోస్టర్‌లో పండుగ వాతావరణం ఉట్టిపడుతోంది. 1960ల నాటి గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామా టీజర్ ఇప్పటికే 15 మిలియన్లకు పైగా వ్యూస్‌తో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచింది.

శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె. రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో శర్వానంద్‌కు జోడీగా అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, ఈ చిత్రాన్ని నవంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



# డిసెంబర్ 4న నితిన్ 'అలియాస్ రుక్మిణి'..

### రుక్మిణి ఎవరో అక్టోబర్ 13న తెలుస్తుందట!

టాలీవుడ్ హీరో నితిన్ నటిస్తున్న కొత్త సినిమా 'అలియాస్ రుక్మిణి' విడుదల తేదీ ఖరారైంది. దర్శకుడు మురళీ కాంత్ దేవసోత్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ 'యునానిమస్ ప్రొడక్షన్స్' శుక్రవారం ప్రకటించింది. అయితే సినిమాలో రుక్మిణి ఎవరు? అనే ప్రశ్నకు అక్టోబర్ 13న సమాధానం చెబుతామని మేకర్స్ ఆసక్తి పెంచారు. ఈ సినిమాను ప్రముఖ హీరో నాని సమర్పిస్తున్నారు. దీప్తి గంటా నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. ఈ వీడియోలో నాని, దర్శకుడు మురళీ కాంత్ సినిమా కథ గురించి మాట్లాడుకుంటున్నట్లు చూపించారు. ఇది కృష్ణుడి కథ అని దర్శకుడు చెప్పగానే నాని ఆసక్తిగా వింటాడు. అయితే గ్లింప్స్‌లో కనిపించిన పుస్తకాలన్నీ రుక్మిణి రాసినవేనని తెలుసుకుని.. "ఈ రుక్మిణి ఎవరు?" అని అడుగుతాడు. అప్పటివరకు నిద్రపోతున్న నితిన్ మేల్కొని "రుక్మిణి నా భార్య" అని చెప్పడంతో గ్లింప్స్ ముగుస్తుంది. ఈ సినిమా తొలి షెడ్యూల్ షూటింగ్ సెప్టెంబర్‌లో పూర్తయింది. పది రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో నితిన్‌తో పాటు సాయికుమార్, హర్షవర్ధన్, ఇతర ముఖ్య నటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. సాంకేతికంగా కూడా ఈ సినిమాకు మంచి బృందం పనిచేస్తోంది. జోమోన్ టీ. జాన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, విజయ్ బుల్గానిన్ సంగీతం సమకూరుస్తున్నారు. సృజన అడుసుమిల్లి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. రేఖ బొగ్గరపు కాస్ట్యూమ్స్ బాధ్యతలు చూస్తున్నారు. రమణ మాధవరం సహదర్శకుడిగా పనిచేస్తున్నారు. టైటిల్ గ్లింప్స్‌ను పంచుకున్న నితిన్.. ఈ సినిమా ప్రేక్షకుల మనసులను నేరుగా తాకుతుందని ఆసక్తికరంగా వ్యాఖ్యానించాడు. ఇప్పటికే టైటిల్‌తో ఆసక్తి రేపిన ఈ సినిమా నుంచి అక్టోబర్ 13న ఎలాంటి వివరాలు వెల్లడవుతాయో చూడాలి.



## పవన్ కల్యాణ్ అంటే చిన్నప్పటి నుంచి క్రేజ్: ఆనంది



తెలుగు, తమిళ చిత్రాలతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆనంది.. ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌పై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చిన్నప్పటి నుంచి తాను పవన్ కల్యాణ్‌కు పెద్ద అభిమానినని, ఆయనే తన క్రష్ అని ఆమె తన మనసులోని మాటను వెల్లడించారు. తన తాజా చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆనంది మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా, మీకు ఇష్టమైన హీరో ఎవరు? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె ఏమాత్రం తడుముకోకుండా సమాధానమిచ్చారు. "చిన్నప్పటి నుంచి నాకు పవన్ కల్యాణ్ గారంటే ఎంతో ఇష్టం. నిజం చెప్పాలంటే చిన్నతనం నుంచే ఆయనే నా క్రష్" అంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు.

పవన్ కల్యాణ్ సినిమా విడుదలవుతోందంటే చాలు, తమ ఇంట్లో పండగ వాతావరణం నెలకొంటుందని ఆమె వ్యాఖ్యానించారు. వెండితెరపై ఆయన ప్రదర్శించే విలక్షణమైన మ్యానరిజమ్స్, స్టైల్‌ను తాను ఎంతగానో ఇష్టపడతానని తెలిపారు. నటిగా చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి, తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న తర్వాత కూడా పవన్‌పై ఉన్న అభిమానం ఏమాత్రం తగ్గలేదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆనంది చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

## 'బాహుబలి'ని మించిన ప్రయోగం.. వారణాసి కోసం ప్రత్యేక భాష సృష్టిస్తున్న జక్కన్న?

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తన సినిమాల్లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇప్పుడు మహేశ్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న వారణాసి కోసం మరో ఆసక్తికర ప్రయోగానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా ఓ కల్పిత భాషను రూపొందిస్తున్నారట. అంతేకాదు.. ఆ భాషకు సొంత లిపి, వ్యాకరణ నియమాలు కూడా ఉండనున్నట్లు తెలుస్తోంది.

ఈ సినిమాలో మహేశ్‌బాబుతో పాటు ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'వెరైటీ' కథనం ప్రకారం.. సినిమాలోని ఓ కీలక సన్నివేశంలో ప్రధాన పాత్రలు ప్రాచీన లిపి ఉన్న ఓ గుహలోకి వెళ్తాయి. అక్కడి గోడలపై ఉన్న రాతల్లోని రహస్యాన్ని ఛేదించాలంటే వారికి ఆ కొత్త భాషను అర్థం చేసుకోవాల్సి ఉంటుందట. కథలో ఈ భాష కీలక పాత్ర పోషించనుందని సమాచారం.'బాహుబలి: ది బిగినింగ్' సినిమాలోనూ రాజమౌళి కల్పిత భాషను ఉపయోగించిన విషయం తెలిసిందే. గేయ రచయిత, రచయిత మదన్ కార్కీ సహకారంతో రూపొందించిన 'కిలికి' భాషను ఆ సినిమాలో కాలకేయులు మాట్లాడారు. అయితే 'వారణాసి'లో ఈ భాషకు మరింత ప్రాధాన్యం ఉండనుందని తెలుస్తోంది. పదాలు, వాక్య నిర్మాణం, లిపి సహా పూర్తి భాషను అభివృద్ధి చేయడానికి ఓ భాషా నిపుణుడిని నియమించినట్లు కథనాలు చెబుతున్నాయి.

ఇక ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా సుమారు 120 దేశాల్లో, 50 భాషల్లో విడుదల చేయాలని రాజమౌళి భావిస్తున్నట్లు గతంలో 'మిడ్ డే' కథనం వెల్లడించింది. ఇందుకోసం దాదాపు 1,500 మంది వాయిస్ ఆర్టిస్టులకు ఆడిషన్లు నిర్వహించే ఆలోచనలో ఉన్నారట. ఏఐతో రూపొందించిన స్వరాల కంటే నటీనటుల భావోద్వేగాలను ప్రతిబింబించే మనుషుల గొంతులకే ఆయన ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. వారణాసి చిత్రం 2027 ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.





## ఆ విమర్శలు పట్టించుకుంటే భయంతో ఆగిపోయేదాన్ని

బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ సోషల్ మీడియా ట్రోలింగ్, బాడీ షేమింగ్‌పై ఘాటుగా స్పందించారు. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రతికూల వ్యాఖ్యలకు భయపడితే జీవితంలో ముందుకు సాగలేమని ఆమె అన్నారు. లండన్‌లో తన సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడి జననం తర్వాత ఇటీవల కత్రినా తొలిసారిగా బయట కనిపించినప్పుడు, సోషల్ మీడియాలో ఆమె శరీరాకృతిపై కొందరు నెగటివ్ కామెంట్లు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమె స్పందించారు. "సోషల్ మీడియాలో వచ్చే మాటలు మన ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపకుండా చూసుకోవాలి. ప్రతి ఒక్కరి కామెంట్లను పట్టించుకుంటూ పోతే, మనకోసం మనం నిర్ణయాలు తీసుకోలేం. ప్రతి విమర్శకు నేను స్పందించి ఉంటే, భయంతో అక్కడే స్తంభించిపోయేదాన్ని" అని కత్రినా వివరించారు.

కొన్నిసార్లు ప్రపంచం మనల్ని ప్రశంసిస్తుందని, మరికొన్నిసార్లు మనకు మనమే ధైర్యం చెప్పుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆమె పేర్కొన్నారు. గతేడాది నవంబర్‌లో కత్రినా ఓ బాబుకు జన్మనిచ్చారు. ఆ తర్వాత ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు ఆమెపై బాడీ షేమింగ్ కామెంట్లు వచ్చాయి. ఈ ఘటన జరిగిన కొన్ని వారాల తర్వాత ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613